# తానా పత్రిక


**Telugu Association of North America**

❖ Volume - 30 ❖ Issue - 10 ❖ November 2023




# We congratulate

# TANA

## on it's
## Successful completion of
## 23rd National Conference

A real estate investment firm that prides itself on expanding your investment portfolio while standing firm on our commitment to grow with you.



ilan™

*Chowdary 'Charlie' Yalamanchili, President*

www.ilaninvestments.com • charlie.yalamanchili@ilaninvestments.com

(281) 444-1585 Phone • (832) 415-0333 Fax

4420 Cypress Creek Parkway • Houston, TX 77068

EQUAL HOUSING OPPORTUNITY

Volume-30 Issue-11
November 2023

*

*Editor*
**Sai Brahmanandam Gorti**
gorthib@gmail.com

*Associate Editor*
**Naveen Vasireddy** (India)
kathanaveen@gmail.com

*

The opinions expressed in TANA Patrika belong to the individual authors and do not necessarily reflect those of TANA or the Editorial Board.

# TELUGU ASSOCIATION OF NORTH AMERICA

**A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID - 36-3060732**
**26233 Taft RD, Novi, MI 48374**

# ఉత్తర అమెరికా తెలుగు సంఘము

*Our Mission*

**"To identify and address social, cultural and educational needs of North American Telugu Community in particular and Telugu people in general"**

*President*
**Niranjan Srungavarapu**
(248) 342-6872
president@tana.org


*Secretary*
**Sateesh Kumar Vemuri**
(925) 989-4536
secretary@tana.org

*Treasurer*
**Ashok Babu Kolla**
(270) 293-0003
secretary@tana.org

*Joint Secretary*
**Murali Talluri**
2162693227
jointsecretary@tana.org

*Joint Treasurer*
**Bharath Maddineni**
(678) 772-1681
jointtreasurer@tana.org

*Chairman, Board of Directors*
**Dr. Hanumaiah Bandla**
(248) 788-9522
bodchairman@tana.org




**కవర్ ఫోటో**
**దీపావళి వెలుగులు**




**మాతృభూమి సేవ నా అదృష్టం**
16

**పేద విద్యార్థులకు సైకిళ్ళు, ల్యాప్‌టాప్‌లు**
18



**యండమూరి వీరేంద్రనాథ్ సీరియల్**



**వెన్నెల్లో ఆడపిల్ల**
46

**ట్రై స్కూటర్ల పంపిణీ**
19





**దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీ**
20

**నివాళి**
**చంద్రమోహన్**
59




## ఇంకా...


Editorial ... 05
TANA President's Message ... 06
TANA Executive Committee ... 08
TAANNAA Board of Directors ... 09
TAANA Foundation ... 10
TANA Foundation Donation Form ... 14
తానా ఆదరణ - నీటిశుద్ధి కేంద్రం వితరణ ... 17
పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్ ... 17
Bicycles for School Boys ... 21
డల్లాస్‌లో తెలుగు గ్రంథాలయం ... 22

వంశీ ఏవో కొన్ని గుర్తుకొస్తున్నాయి
*లాయర్ సుహాసిని - 1* ... 24
Hamlet - A Tragic Hero
*- Abhinuta Maddukuri* ... 35
కథ - కవిత్వం వర్ధిల్లాలి!
*- పాపినేని శివశంకర్* ... 38
జ్ఞాపకాలు
చలనచిత్రం - ఎ. జగన్నాథ శర్మ ... 56
2024 సంక్రాంతి సినిమా పందెం కోళ్లు
*- జలపతి & శ్రీ అట్లూరి* ... 63



## సంపాదకీయం

తానాపత్రిక పాఠకులకి, అందరికీ దీపావళి శుభాకాంక్షలు!

నవంబరు నెల వచ్చిందంటే అమెరికాలో వీధులూ, ఇళ్ళూ రంగు రంగుల దీపాలతో కళకళలాడుతూ వుంటాయి.

ఈ నెల చివరలో వచ్చే ***Thanks Giving*** పండుగ కుటుంబాలు అన్నీ కలిసి ఆనందం, ఉత్సాహాలతో గడిపే సంతోష సమయం.

అమెరికా వాసులందరికీ - ***Happy Thanks Giving!***

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఏణ్ణర్థంగా సాగుతూనే ఉంది.

ప్రజలూ, ప్రపంచమూ ఈ యుద్ధానికి అలవాటు పడిపోయారు.

ఇంతలోనే మిడిలీస్ట్‌లో మరో యుద్ధం.

గత నాలుగైదు వారాలుగా మిడిలీస్ట్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. ఎంతోమంది సైనికులూ, అమయాకులైన ప్రజలూ దుర్మరణం పాలయ్యారు.

దురదృష్టం ఏమిటంటే సాంకేతిక ప్రగతి పెరిగి అన్ని దేశాల మధ్య దూరం తగ్గించింది. ఏ దేశంలో విపత్తు జరిగినా నిమిషాల్లో ప్రపంచానికి తెలుస్తోంది. ఈ ప్రగతికి మరో పార్శ్వం, ఎవరి ప్రమేయమూ లేకుండా అనవసర విద్వేషాలు.

త్వరలోనే యుద్ధాలు, విద్వేషాలు సమసిపోయి శాంతి వాతావరణం నెలకుంటుందని ఆశిద్దాం!

నాలుగు తరాల పాఠకుల్ని ప్రభావితం చేసిన యండమూరి వీరేంద్రనాథ్ ప్రసిద్ధ నవల 'వెన్నెల్లో ఆడపిల్ల' ఈ నెల నుండి సీరియల్‌గా ప్రచురిస్తున్నాము. మీరూ చదివి ఆనందిస్తారని ఆశిస్తున్నాము.

అభినందనలతో...

సాయి బ్రహ్మానందం

www.digitaltimes.co

# What's Next For You?



**Leverage Our Digital Marketing Expertise for Your Business Evolution With The times**

- Content Marketing
- Position 0 & Next Gen SEO
- Lead Gen to Door Knocks
- E-commerce Multiplication

Google Partner | facebook for business | Microsoft Gold Partner | DIGITAL TIMES

Encinitas, USA; Hyderabad & Bangalore, India | hello@digitaltimes.co
**+91 98480 16666 +1 424-253-0800**

# President's Message



**NIRANJAN SRUNGAVARAPU**
*President*

తానాపత్రిక పాఠకులకి, కార్యవర్గానికి, సభ్యులకి, అందరికీ దీపావళి శుభాకాంక్షలు!

అమెరికాలో ఉన్న వారందరికీ ***Happy Thanks Giving***. నవంబరు, డిసెంబరు రావడంతోనే అమెరికాలో పండగా వాతావరణం వచ్చేస్తుంది. ప్రతి ఇల్లూ, ఊరు రంగురంగుల దీపాలతో కళకళలాడుతూ వుంటాయి.

తెలుగు సాహితీ, సాంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ తానా ఎన్నో ఏళ్లుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూనే వుంది.

ఆ దృక్పథంలోనే 'వందే విశ్వమాతరం' అనే ఒక కార్యక్రమానికి రూపకల్పన చేసాము. వంద దేశాలలోని ఆయా దేశాల తెలుగు సంఘాలతో కలిసి ఈ కార్యక్రమము నిర్వహిస్తాము. ఈ కార్యక్రమంలో భాగంగా లక్ష మొక్కలు నాటడం, అమ్మ-నాన్న-గురువు అనే విశేష కార్యక్రమాలు రూపొందించాము.

ఇంకా తెలుగు రాష్ట్రాలలో చేయూత, ఆదరణ వంటి కార్యక్రమాలే కాకుండా పలు దీర్ఘకాలిక కార్యక్రమాలు నిర్వహించడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆయా కార్యక్రమాల వివరాలు అతి త్వరలోనే మీముందుకు తీసుకొస్తాము.

మీ సహాయ సహకారాలే తానా ప్రగతికి స్ఫూర్తి.

మీ అందరి ప్రోత్సాహం మాకు వెన్నుదన్నుగా ఉంటుందన్న నమ్మకం మాకుంది.

సదా మీ ఆదరాభిమానాలని కోరుతూ...

మీ
నిరంజన్ శృంగవరపు

# TANA EXECUTIVE COMMITTEE - 2023-2025



**Niranjan Srungavarapu**
*President*



**Sateesh Kumar Vemuri**
*Secretary*



**Ashok Babu Kolla**
*Treasurer*



**Murali Talluri**
*Joint Secretary*



**Bharath Maddineni**
*Joint Trerasurer*

# TANA BOARD OF DIRECTORS - 2023-2025

Our Youth are Our Heritage
Est. 1977
www.tana.org



**Dr. Hanumaiah Bandla**
*Chairman*



**Murali Vennam**
*Secretary*



**Lakshmi Devineni**
*Treasurer*



**Janardhan Nimmalapudi**
*Director (Non-Donor)*



**Srinivas Lavu**
*Director*



**Dr. Chowdary Jampala**
*Director*



**Dr. Nagendra Srinivas Kodali**
*Director*



**Niranjan Srungavarapu**
*Ex Officio Member*
*President, EC*



**Anjaiah Chowdary Lavu**
*Ex Officio Member*
*Past President, EC*




**Jayasekhar Talluri**
*Ex Officio Member*



**Sateesh Kumar Vemuri**
*Ex-Officio Member*
*Secretary, EC*




**Ashok Babu Kolla**
*Ex-Officio Member*
*Treasurer, EC*



**Venkataramana Yarlagadda**
*Ex Officio Member*



**Sasikanth Vallepalli**
*Ex Officio Member*
*Chairman, TANA Foundation*



**Srikanth Polavarapu**
*Ex-Officio Member*
*Treasurer, TANA Foundation*


# TANA FOUNDATION - 2023-2025



**Niranjan Srungavarapu**
*President*



**Sasikanth Vallepalli**
*Secretary*



**Srikanth Polavarapu**
*Treasurer*



**Vinaykumar Maddineni**
*Trustee (Non Donor)*



**Vidyadhar Garapati**
*Trustee*



**Kiran Gogineni**
*Trustee (Non Donor)*



**Purushotham Chowdary Gude**
*Trustee (Non Donor)*



**Srinivas Oruganti**
*Trustee (Non Donor)*


ఉత్తర అమెరికా తెలుగు సంఘము

# Telugu Association of North America

A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID: 36-3060732

Est. 1977
www.tana.org

# TANA Member Benefits








## Car Rentals

### Enterprise and National Car Rental

Account # OSMBAQT| Discount upto 10% |Prioirty car rental

**Budget Car Rental:** CDP# V124932 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Avis Car Rental:** CDP# T326011 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Dollar Car Rental:** CDP# 3075644 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

**Thrifty Car Rental:** CDP# 3075647 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

## Hotel and Hospitality

**Hyatt Group:** Corporate Code 225686 | 15% Discount on all participating Hyatt Group Hotels

Enter you're the corporate code under Special Rates-Corporate or Group code.

**IHG Group:** Corporate Code 787101128 | 7% Discount on all participating IHG Hotels

**Choice Group:** Corporate Code 00746710 5% Discount on all participating Choice Hotels Group

## Residential Services

**Sherwin Williams:** Corporate Account# 7901-4243-4 Upto 60% off

**Mattress Firm:** Corporate Account#13081634 Upto 65% off
Please reach out to Ashok Kolla to place order

## Automobile

**Discount Tires:** Corporate Account 63928 10% Discount on All tires Price match guaranteed.

**Mavis Tires:** Corporate Account 12956 15% Discount on Tires, Brakes & Other Services | Price match guaranteed.

**Jiffy Lube:** Corporate Account 13081634 15% off oil changes

**Valvoline:** Corporate Account P4083246 15% off oil changes, and car services | Tax Exempt

**Take 5:** Corporate Account 172285 25% off on all services | Extra 5% off before 9 AM and afer 5PM Additional 5% off Ancillary items

**NAPA Autoparts:** Corporate Account 18776 Upto 30% off car parts and accessories Tax Exempt



**Niranjan Srungavarapu**
TANA, President



**Ashok Babu Kolla**
TANA, Secretary

We believe members are heart for our organization and we will continuously strive to provide more benefits for our members. Should you have any questions regarding this benefits,

**Please feel free to call Ashok Kolla @ 1-270-293-0003**

# TANA ELECTIONS 2023

***"To identify and address social, cultural and educational NEEDS of North America Telugu Community in particular and Telugu people in general"***

**A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID - 36-3060732**

**26233 Taft RD, Novi, MI 48374 info@tana.org**

## ANNOUNCEMENT & SCHEDULE OF ELECTIONS

*Dear Members:*

*By authorization of the Board of Directors of the Telugu Association of North America (TANA), the Nominations and Elections (N/E) Committee will be conducting the organizational elections for the 2023-2025 term for the Executive Committee and 2023-2027 term for the Board of Directors and the TANA Foundation. On 11th Oct 2023, Maryland Montgomery County Circuit Court ordered the elections to be completed by Jan 25, 2024. The N/E Committee requests all members to cooperate in this effort and choose the future office bearers of TANA. Those who are interested to contest may send their applications by following guidelines properly. Application form and procedures enclosed.*

***Chairman***

**Kanakam Babu Inampudi**

***Members***

**Anjaneyulu Koneru, Raja Mutyala**
**Venkateswara Rao Kata, Raghavendra Choudary Vemulapalli**

***Conducted By***

**TANA Nominations/ Elections Committee**
**(Email: elections@tana.org)**

## NOMINATIONS/ ELECTIONS SCHEDULE

| | |
|---|---|
| Publication of Election Schedule | Tuesday October 31, 2023 |
| Last date for receipt of nominations | Thursday, November 16, 2023 |
| Approval of nominations/notification to candidates | Wednesday, November 22, 2023 |
| Last date for withdrawal of nominations | Thursday, November 30, 2023 |
| Publication/notification of final list of Nominations | Sunday, December 3, 2023 |
| Final day to submit Election Flyers | Wednesday, December 6, 2023 |
| Ballot mailing by USPS 1st class | Friday, December 15, 2023 |
| Last date by which ballots must be received | Wednesday January 10, 2024 |
| Ballot Counting | Saturday, January 13, 2024 |
| Certification/ Publication of election results | Sunday January 14, 2024 |

## OPEN POSITIONS FOR THE 2023-2025/27 ELECTION CYCLE

***Board of Directors***

Three (3) Open Positions as follows - Four Year Term - 2023-2027
Non-Donor Director: Three (3) Positions
Donor Director: One (1) Position

***Executive Committee***

Twenty Nine (29) positions as follows; two year term (2023-2025)

- Executive Vice President
- Secretary
- Treasurer
- Joint Secretary
- Joint Treasurer
- Community Service Coordinator
- Cultural Service Coordinator
- Women Services Coordinator
- Councilor - At large
- International Coordinator
- Sports Coordinator
- Regional Representative - New England
- Regional Representative - New York
- Regional Representative - New Jersey
- Regional Representative - Mid Atlantic
- Regional Representative - Capital
- Regional Representative - Appalachian
- Regional Representative - Southeast
- Regional Representative - North
- Regional Representative - Ohio Valley
- Regional Representative - Midwest
- Regional Representative - South Central
- Regional Representative - DFW
- Regional Representative - Southwest
- Regional Representative - North Central
- Regional Representative - Southern California
- Regional Representative - Northern California
- Regional Representative - North West
- Regional Representative - Rocky Mountains

*(Please refer Bylaws for geographical area associated with each Region)*

***Foundation***

Seven (7) open positions as follows - Four (4) year term (2023-2027)
***Foundation Trustee:*** 4 Years term (Five positions)
***Foundation Donor Trustee:*** 4 Years Term (Two positions)

**Dr. Hanumaiah Bandla**
Chairman
Board of Directors - TANA

# TANA FOUNDATION

*Division of Telugu Association of North America (TANA)*
*A not-for profit organization, Tax ID 36-3060732*

***To Donate or pledge please visit www.tana.org/donate or www.tanafoundation.org/donation or mail this form***

***We make a living by what we get; we make a life by what we give.***

## TANA FOUNDATION DONATION FORM

Name (First, Last): ______________________________

Address: ______________________________

Email Address:______________________ Phone:________________

I would like to sponsor the following:

- Orphanages: US$__________
- Vaaradhi US$__________
- Scholarships ($250 each): US$__________
- Eye Camp ($600)
  (Requires filling the sponsorship form on the web): US$__________
- Cancer Camp ($1500 each): US$__________
- Cleft Lip Surgeries ($250 each): US$__________
- Libraries ($500 each): US$__________
- Other (Specify) ________________ US$__________

Frequency (Check one) : ☐ One time ☐ Monthly ☐ Yearly

Check Number: ______________ (Payable to TANA Foundation)

Credit Card Number: ______________________________

Billing Address: ______________________________

CV Code: ____________

*Please mail the completed form to:*

**TANA Foundation**
**Treasurer**
26233 Taft Road,
Novi, MI 48374.

***For any questions or comments, please send an email to jaytalluri@gmail.com***

WWW.TECHINSURANCEINC.COM

# YOUR EMPLOYEES HEALTH OUR PROMISE



HEALTH INSURANCE FOR IT COMPANIES

BUSINESS INSURANCE

VISITORS INSURANCE



**MURALI TALLURI**
FOUNDER
+1 (512) 917 - 8686
murali@techinsuranceinc.com

TECH INSURANCE AGENCY
EMPLOYEE BENEFITS & BUSINESS INSURANCE

(512) 917-8686
Fax:1-512-829-3488

Contact us:3000 Polar Ln, Unit#802
Cedar Park ,TX,78613

# మాతృభూమికి సేవ చేసే అవకాశం రావడం నా అదృష్టం

## సామినేని రవి, తానా సభ్యులు

తానా ఫౌండేషన్ మరియు సామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28న అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మధిర మండలం మాటూరు పేటలో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటి అందించేందుకు రెండు లక్షల రూపాయలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం శ్రీమతి సామినేని రాధమ్మ జ్ఞాపకార్థం ఖమ్మం రోటరీ లింబ్ సెంటర్ నందు తానా ట్రస్టీ శ్రీ సామినేని రవి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రోటరీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేదలైన ఆరుగురు బాలికలకు సైకిళ్లు అందించారు. ఉన్నత ఆశయాలతో చదువుకునే ఆడపిల్లల చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, ఆ ఉన్నత చదువులు చదివే ఆడపిల్లలకు తమ పూర్తి సహకారం అందిస్తామని ఈ కార్యక్రమంలో రవి సామినేని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతుకూరి మధు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం రోటరీ లింబ్ సెంటర్లో పదిమంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలను ఆరుగురు మహిళలకు స్వయం సమృద్ధిని సాధించేందుకు కుట్టుమిషన్లను ముగ్గురు పేద విద్యార్థులకు ఒక్కొక్కటి 55వేల రూపాయల విలువ చేసే లాప్‌టాప్‌లను, ఇద్దరు దివ్యాంగ మహిళలకు ఒక్కొక్కటి లక్షా పదివేల రూపాయల విలువైన యాక్టివా బండ్లను అందించారు. ఖమ్మంలోనే పుట్టి పెరిగిన తనకు విదేశాలలో ఉద్యోగం చేసే అవకాశం రావడం ఒక అదృష్టం అయితే మాతృదేశానికి చెందిన నిరుపేదలకు తానా మరియు సామినేని ఫౌండేషన్ ద్వారా సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని సామినేని రవి అన్నారు. ఈ కార్యక్రమంలో తానా ఫౌండేషన్ ట్రస్టీ, సామినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు సామినేని రవి, సామినేని నాగేశ్వరరావు, మిత్ర ఫౌండేషన్ అధ్యక్షులు కురివెళ్ల ప్రవీణ్, తానా సభ్యులు యార్లగడ్డ శశాంక్, ప్రవీణ్ అంకం, రోటరీ అధ్యక్షులు దానయ్య, బండి నాగేశ్వరరావు, పసుమర్తి రంగారావు, అనేకమంది రోటరీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.



# నీటి శుద్ధి కేంద్రం వితరణ







మాటూరులో ప్రభుత్వ పాఠశాలకు రవి సామినేని, వారి తల్లి రాధమ్మగారి జ్ఞాపకార్ధం నీటి శుద్ధి కేంద్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో సామినేని ఫౌండేషన్ ఛైర్మెన్ నాగేశ్వరరావు, తానా ఆదరణ కోర్డినేటర్ రవి సామినేని, శశాంక్ యార్లగడ్డ, ప్రవీణ్ అంకం, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మాటూరులో ప్రభుత్వ పాఠశాల విద్యార్ధులకు క్రికెట్ కిట్ పంపిణీ

మాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శశాంక్ యార్లగడ్డ, ప్రవీణ్ అంకం, రవి సామినేని చేతుల మీదుగా అందచేసారు. ఈ సందర్భంగా శశాంక్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



తానా మరియు సామినేని ఫౌండేషన్ ఖమ్మంలోని రోటరి నగర్ ప్రభుత్వ పాఠశాలలో రవి సామినేని, వారి తల్లి రాధమ్మగారి జ్ఞాపకార్థం ఆరుగురు పేద విద్యార్థినులకు సైకిళ్లను సామినేని నాగేశ్వరరావు చేతులమీదుగా అందచేసారు. ఈ కార్యక్రమంలో తానా సభ్యులు ప్రవీణ్ అంకం, శశాంక్ యార్లగడ్డ, రవి సామినేని పాల్గొన్నారు.



# పేద విద్యార్థులకు లాప్‌టాప్‌లు



ఖమ్మంలో రవి సామినేని, వారి తల్లి రాధమ్మగారి జ్ఞాపకార్థం ముగ్గురు పేద విద్యార్థులకు లాప్‌టాప్‌లు సామినేని నాగేశ్వరరావు చేతులమీదుగా అంద చేసారు. ఈ కార్యక్రమంలో తానా సభ్యులు ప్రవీణ్ అంకం, శశాంక్ యార్లగడ్డ, రవి సామినేని పాల్గొన్నారు.





# ట్రై స్కూటర్ల పంపిణీ

ఖమ్మంలో రవి సామినేని, వారి తల్లి రాధమ్మగారి జ్ఞాపకార్థం ఇద్దరు పేద అంగవైకల్య మహిళలకు ట్రై స్కూటర్లను సామినేని నాగేశ్వరరావు చేతులమీదుగా అంద చేసారు. ఈ కార్యక్రమంలో తానా సభ్యులు ప్రవీణ్ అంకం, శశాంక్ యార్లగడ్డ, రవి సామినేని పాల్గొన్నారు.








# దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీ

నవంబరు 5, 2023వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి సహకారంతో 100 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాల పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పసుమర్తి రంగారావు, కాశీప్రసాద్ మావులేటి పాల్గొన్నారు. రవి సామినేని దాతగా వ్యవహరించారు.










# Bicycles Distribution for Government School Boys

A Few weeks ago, TANA Foundation received the following request from a remote village in Bhupalpally district of Telangana.




*Sir, I am govt.teacher working in ZPHS Dhanwada, Kataram Mandal, Jayashankar Bhupalapally District which is a remote district in Telangana State. In our school nearly 10 students are coming from a neighbour village by walk which is 5km long. In rainy season they are almost absent due to travelling issue. Sir, if you provide any financial assistance to buy bicycles for them it will be useful for them and other students will also motivate to come to school. Please try to help them Sir. Thank you, wait for your reply.*

TANA president Niranjan Srungavarapu has reacted immedia-tely and initiated to execution of this program under TANA Foundation Aadharana.

We are happy to inform we were able to fulfil their request with the help of donors Raja Kasukurthi, Ashok Babu Kolla, and Ravi Samineni. The kids were very happy and don't have to miss the school due to the Rains.





# డల్లాస్‌లో తెలుగు గ్రంథాలయం ప్రారంభం

అమెరికాలో తెలుగువారు అధికంగా నివసించే నగరాల్లో ఒకటైన డల్లాస్‌లో శుక్రవారం సాయంత్రం తెలుగు గ్రంథాలయాన్ని ప్రారంభించారు. డల్లాస్ శివారు లూయిస్‌విల్‌లో ప్రవాసాంధ్రుడు మల్లవరపు అనంత్ R2 Realty కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయాన్ని గాయని ఎస్పీ శైలజ, గాయకుడు ఎస్పీ చరణ్, తానా మాజీ అధ్యక్షుడు డా. తోటకూర ప్రసాద్‌లు ప్రారంభించారు.

ఎస్పీ శైలజ మాట్లాడుతూ అమెరికాలో తెలుగు గ్రంథాలయం ఏర్పాటుచేయడాన్ని హర్షించారు. రోజుకు ఒక పేజీ తెలుగు చదవాలని, తద్వారా మాతృ భాషకు దూరం కాకుండా ఉండగలమని అన్నారు. ఎస్పీ చరణ్ మాట్లాడుతూ తెలుగుభాష పట్ల మక్కువతో అనంత్ ఏర్పాటుచేసిన గ్రంథాలయం అమెరికాలో వెలుగులు పంచాలని ఆకాంక్షించారు. తానా మాజీ అధ్యక్షుడు డా. తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ ఆస్టిన్‌లోని యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్‌లో తెలుగు కోర్సుల నిర్వహణ నిమిత్తం తానా నిధుల సేకరణ చేపట్టినప్పుడు ఎస్పీ బాలు విభావరితో అలరించాలని ఆయన ఆశ, ధ్యాస, శ్వాస తెలుగుభాష అని కొనియాడారు. తానా ప్రపంచ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో ఆరు సంపుటాలుగా వెలువరించిన సిరివెన్నెల సమగ్ర సాహిత్యాన్ని శైలజ-చరణ్‌ల చేతుల మీదుగా ఈ గ్రంథాలయానికి బహుకరించారు. త్వరలోనే తానా ఆధ్వర్యంలో కవిరత్న కొసరాజు రాఘవయ్య చౌదరి సమగ్ర సాహిత్యాన్ని వెలువరిస్తామని ప్రసాద్ తెలిపారు. 'ట్యాంక్‌బండ్‌పై తెలుగు విగ్రహాల ప్రశస్తి,' పేరిట చెన్నపూరి తెలుగు అకాడమీ ప్రచురించిన పుస్తకాన్ని కూడా ఈ సభలో ఆవిష్కరించారు.

వేముల లెనిన్, మద్దుకూరి చంద్రహాస్, అనంత్ మల్లవరపులు కొండేపూడి లక్ష్మీనారాయణ రచించిన, 'పాడరా ఓ తెలుగువాడా,' గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభించారు. అతిథులకు అనంత్ ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి పేరిట స్వదేశంలో పాఠశాల కట్టించానని, అమెరికాలో తన తల్లి పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శారద సింగిరెడ్డి, సుబ్రహ్మణ్యం జొన్నలగడ్డ, పరమేష్ దేవినేని, రాజేష్ అడుసుమిల్లి, బీరం సుందర రావు, సురేష్ మండువ, లక్ష్మి పాలేటి పాల్గొన్నారు.








ONE OF A KIND, WORLD-CLASS
VILLA PROJECT AT THE MOST EMERGING
LOCATION, KAPULUPPADA, VISAKHAPATNAM.
JUST 7 KMS FROM IT HUB
₹3.1 cr* onwards
Possession by April 2024
62 High-end villas
Villas ranging from 4,002 sq. ft. to 7,435 sq. ft.
11 Acres, 73% Green & open spaces
Tennis, Basket ball, Shuttle courts & Cricket pitch
32,000 sq. ft. clubhouse
Play areas & Outdoor fitness station
*T&C Apply
Scan the code to download our brochure
For more details contact
+91 96903 88888
Kapuluppada, Visakhapatnam
Contact@villaasam.com
Visit www.villaasam.com
VILLAASAM
BY
AUGMENTED REALTY

# ఏవో...... కొన్ని గుర్తొస్తున్నాయి









వంశీ

## లాయర్ సుహాసిని 1

design: సత్యసుందరమ్

చాలా దగ్గరకొచ్చినామె నాకు అరంగుళం దూరంలో ఆగిపోయుంటే, "నీ పేరేంటీ?" అన్నాను.

చెప్పింది.

"ఇదంతా ఏంటీ?" అన్నాను.

చెప్పింది.

నవ్విన నేను, "ఇలా చేసే పద్ధతి నాకైతే లేదు. నీకెవరో రాంగ్ రూటు చూపిస్తున్నారు. వెళ్లి ఆ బట్టలేసుకునొస్తే కొన్ని ముక్కలు మాటాడతాను," అన్నాను.

హీరోయినవ్వాలన్న తాపత్రయంలో ఉన్నామె గబగబా బట్టలేసుకునొచ్చింది.

"నీ బట్టలు నువ్విప్పుకోకూడదు. నేను విప్పాలి. అలా విప్పాలని ముందు నాకనిపించాలి."

అర్థమైందో అవ్వలేదోగానీ ఏం మాటాడలేదా అమ్మాయి.

"వాళ్లకి కావల్సింది వాళ్లు చేసేసుకుని మీకు కావల్సింది మీకు చేసి పెట్టేవాళ్లు మా వృత్తిలో చాలా మందున్నారుగానీ నేనాళ్లలా కాదు."

ఇలా నేను మాటాడ్తుంటే సీన్లో చాలా తేడా వచ్చేసింది.

బయటికొచ్చేసిన నేను ఆ చీకట్లో నడుచుకుంటా విశ్వనాథ్‌గారిల్లూ దానెదురుగుండా ఉన్న ఆర్ట్ డైరెక్టర్ తోటగారిల్లూ దాటుకుంటూ హాలీవుడ్ హోటలు దగ్గర కెళ్లేటప్పటికి నన్ను డైరెక్టర్‌వవుతావు అంటూ ఆనాడు ఆశీర్వదించిన పాన్‌లు కట్టే భాషా కనిపించేడు.

హోటల్లోపలికెళ్తుంటే గబగబా నా దగ్గరకొచ్చిన సుబ్రమణ్యంరాజుగారు, "మిమ్మల్ని చూసి కారాపి వచ్చేను... లేడీస్ టైలర్ సిన్మాకి మంచి టాక్," అంటా నాతోపాటు లోపలికొచ్చి టీ తాగాక, "హైదరాబాదెళ్దామండీ?" అన్నారు.

"ఎందుకూ?" అన్నాను.

"సిన్మా జనంతోపాటు చూద్దాం. దాంతోపాటు

ఇంకో ఐడియా కూడా ఉంది నాకు," అన్నారు.

చెప్పండన్నాను.

"ఈ గాలికొండపురం రైల్వేగేటు క్రైమ్ కథని యద్దనపూడి సులోచనారాణిగారితో వెర్షన్ రాయిస్తే ఎలాగుంటదీ?" అన్నారు.

నవ్విన నేను, "ఆవిడ ఒప్పుకుంటే బాగానే ఉంటదేమో," అన్నాను.

"ఒక బెడ్డ వేసి చూద్దాం," అంటా నవ్వేరు.

రెండు రోజుల తర్వాత ఫ్లైట్‌కి హైదరాబాదు వెళ్లిన మేం అశోకా హోటల్లో దిగిన కాసేపటికి తెల్సింది ఈ లేడీస్ టైలర్ సినిమాలో ఆడదాన్ని అవమానించే టైపులో సీన్లున్నాయి గాబట్టి ఆపెయ్యాలని గొడవ చేసిన కొన్ని స్త్రీ సంఘాలు కటౌట్స్‌యియ్యా పీకించేస్తే సినిమా కలెక్షన్లు మరింత పెరిగినియ్యని.

పంజాగుట్టలోపలెక్కడో ఉన్న సులోచనారాణి గారింటికెళ్తే ఎదురొచ్చినావిడ నవ్వుతా పలకరించి లోపలికి రమ్మన్నారు.

ఆవిడ్ని చూడ్డం అదే మొదటిసారి. అలా చూస్తూనే ఉండిపోయాను.

"మిమ్మల్ని తీసుకొస్తున్నట్టు వారు మొన్నే చెప్పారు. దాంతో నిన్న మాట్నీకెళ్లాను మీ లేడీస్ టైలర్‌కి. అబ్బ! బాగుంది. స్పీడంటే స్పీడే," అన్నారావిడ.

"ఆడోళ్లని అవమానించినట్టుందని కొన్ని స్త్రీ సమాజాలు గొడవ చేస్తున్నాయంటండీ," అన్నాను.

"నేనలాగనుకోటంలేదు," అన్నారు.

"మేమెందుకొచ్చామో చెప్పే ఉంటారీ రాజు గారు," అన్నాను.

"చెప్పారుగానీ,నా దగ్గరకొన్ని కథలున్నాయి. ఒక్కోస్లాటూ పదేసి పేజీల కింద రాశాను, చదివి చెప్పండి ఆ తర్వాత మాటాడుకుందాం," అంటా కొన్ని కాయితాలిచ్చేరు.

కాసేపయ్యేకా బయల్దేరేం.

హోటలుకొచ్చేక చదవడం మొదలెట్టిన నాకు, "ఇవన్నీ ఆవిడ రకం కథలు. మనకి కావాల్సింది మీరన్న కథగదా?... రేపు రావడానికి కొంచెం పనుంది. ఈ కాయితాలు వారికిచ్చేసి మీ లోపలి ఆలోచన వారికి చెప్పెయ్యండి. ఆ తర్వాతేమవుద్దో చూద్దాం," అని పంపించేక విడుదలైన లేడీస్ టైలర్ సక్సెస్ వార్తలు ఇంకొన్ని విని బోల్డంత బలం మూటగట్టుకున్నాక ఆ సాయంత్రం ఫ్లైట్‌కి మద్రాసు వచ్చేసేను.

ఆండాళ్ థియేటర్లోనే మా గురువు భారతీరాజా గారికి షో వేస్తే, హిట్ టాక్ బాగా వినేసున్న చాలా మందొచ్చేరు ఇప్పుడు చూడ్డానికి.

"నాకిష్టమైన బాపురమణలు చూడలేదండీ," అని రవికిషోర్‌గారితో అంటే ఆరాత్రి తొమ్మిది గంటలకి దేవీ శ్రీదేవిలో షో వేసేరు.

ఆ సంగతి బాపుగారికి ఫోన్లో చెప్పేను.

"సరే వస్తున్నాం," అన్నారు రమణగారు.

ఎనిమిదిన్నర దాటాక నీలం అంబాసిడర్ కారు విజయ రాఘవాచారి రోడ్లో ఆంధ్రాక్లబ్ పక్కనే ఉన్న ఆ దేవీ శ్రీదేవి థియేటర్ దాటుకుంటా బాగా ముందుకెళ్లి చీకట్లో ఒకచోట ఆగింది.

పరిగెట్టుకుంటా వెళ్లిన నేను, "ఎవరిదో షో జరుగుతుంది సార్ లోపల. తర్వాత మనది స్టార్ట్ చేద్దాం," అన్నాను.

"పర్లేదు అవనివ్వండి," అన్నారు రమణగారు.

సినిమా చూసిన బాపురమణలు ఇంకేం మాటాడకుండా వెళ్లిపోయారాళ్ల ముదురు నీలం కార్లో.

అర్ధరాత్రి ఇంటికొస్తే మోగిన మా లేత నీలం రంగు ఫోను లిఫ్ట్ చేసేను. ముళ్లపూడి వెంకటరమణ



గారు, "వంశీ ఉయ్ లవ్ యూ," అని ఫోన్ పెట్టేస్తే ఈ మాటలు నాకో అవార్డు అనుకుని తెగ ఫీలైపోతా ఎప్పటికో నిద్రపోయాను.

అదే దేవీ శ్రీదేవి థియేటర్లో ఇంకోసారి వేసిన షోకి వచ్చిన చిరంజీవిగారు చాలా ఎంజాయ్ చేస్తా చొక్కా జాకెట్టు అయిన సీనుకి పగలబడి నవ్వుతా కుర్చీలోంచి లేచి మళ్లీ కూలబడ్డారని చెప్పేరు సత్యంగారు. అదే షోకొచ్చిన భానుప్రియ నాకు ఫోన్ చేసి చాన్నాళ్ల తర్వాత హాయిగా నవ్వుకున్నానంది.

అటుపక్క రిలీజై ఆడుతున్న ఆ లేడీస్ టైలర్ సినిమాని జనం, ఇక్కడ వేస్తున్న షోలు చూస్తున్న ప్రముఖులు నన్నాశీర్వదిస్తుంటే ఎలాంటి టానిక్కు తాగినా రాని బలం నాకు.

ఎవరో ప్రొడ్యూసర్లు తమిళ్‌లో డబ్బింగ్ చేస్తామంటే అదెళ్లి ఇళయరాజాగారికి చెప్పేను.

"ఎట్టి పరిస్థితుల్లోనూ వద్దు. అది మొత్తం ఆంధ్రా పల్లెటూళ్ల నేటివిటీతో నిండిపోయిన సినిమా... తమిళియన్స్ చూడరు," అన్నారు.

అదే మాట రవికిషోర్‌గారికి చెప్పేనుగానీ అప్పటికే చాలా విషయాలు జరిగిపోయినియ్యి. అదే సుజాతాలో తమిళ డబ్బింగ్ మొదలైపోయింది. అచ్చం తమిళ పాటల్లా చాలా అద్భుతంగా సాహిత్యం రాసేరు గంగై అమరన్. సినిమా కూడా చాలా బాగా డబ్ అయ్యిందా అరవంలో.



కానీ రిలీజయ్యాక రాజాగారన్నట్టే జరగడంతో ఆ రాత్రి అదే తల్చుకోవడం మొదలెట్టిన నేను, 'నాకు డైరెక్ట్ చేసిన ఏ సినిమా అన్నాసరే ఇంకో భాషలో ఆడదేమో. ఎందుకంటే ఇంప్రొవైజ్ చేసే ఒక రకమైన లక్షణంగల నాలాంటోళ్లతో వచ్చిన గొడవే ఇదీ,' అనుకుంటుండగా రమ్మంటూ ఇళయరాజాగారి దగ్గర్నించి కబురు.

తీరా వెళ్తే, "ఈ మద్రాస్‌లో జరిగే క్రికెట్ చూడ్డానికి లతామంగేష్కర్ వస్తున్నారు బాంబేనుంచి. రెండు మూడు పాటలు రికార్డింగ్ చెయ్యడానికి ఎవరైనా ప్రొడ్యూసర్ రెడీగా ఉన్నారా నీకు?" అన్నారు.

సుబ్రమణ్యంరాజుగారికి కబురుచేసి విషయం చెబితే, "మనం చేసేద్దాంకానీ, స్క్రిప్టు రెడీ అవ్వలేదు కదా?" అన్నారు.

"తర్వాత నేను మేచ్ చేసుకుంటాను," అంటా నా పాత ఎక్స్‌పీరియన్సులు కొన్ని చెబితే, "సరే మరి కానియ్యండి," అన్నారా రాజుగారు.

ఈ గాలికొండపురం రైల్వేగేటు కోసం తమిళ నాడులో ఉన్న ఆ అళయార్ డామ్ గెస్ట్‌హౌస్‌లో కంపోజ్ చేసిన ట్యూన్స్ రాజాగారికి వినిపిస్తే, "ఇవి కాదు, లతాజీ కోసం మంచి సోలో ఒకటి కంపోజ్ చేస్తాను," అంటా గౌరీమనోహరి రాగంలో ఒక ట్యూన్ చేసి, దానికి పల్లవి కూడా ఆయన అనేసేటప్పటికి చిన్నచిన్న మార్పులు నేను చేస్తే, "బావుంది చరణాలు నువ్వు రాయి," అన్నారు.

నిజానికి వేటూరిగారితో రాయిస్తే బాగుండ్ను. కానీ, ఆయనెక్కడ దొరుకుతారింత అర్జంటుగా? దాని తర్వాతది భక్తిపాట. హారర్ బాక్‌గ్రౌండ్సు. అప్పటికప్పుడనుకున్న ఆ సందర్భం ఇళయరాజాగారికి చెబితే, "బాగుందే... మరీట్యూన్‌కి వర్డ్స్?" అన్నారు.

వెంటనే నాయుని కృష్ణమూర్తిని పిలిపించి రాయించేను.

బాంబేలో వయొలిన్ వాయించడంలో చాలా ఫేమస్సయిన ఉత్తమ్ సింగ్ ఆ టైములో అక్కడే ఉన్నారు. ఇళయరాజాగారు చేసే పాటల్ని స్టీరియో

మిక్సింగ్ చెయ్యడానికి వచ్చే ఈ ఉత్తమ్‌గారికి మ్యూజిక్కి సంబంధించిన చరిత్ర చాలా ఉంది.

రికార్డింగులు మొదలయ్యాయి.

మేం రాసిన పాట మహాగాయని అయిన ఆ లతామంగేష్కర్‌గారు పాడుతుంటే లిరిక్‌లో కరెక్షన్లు తెగ చెప్పడం మొదలెట్టేను.

చూస్తున్న ఇళయరాజా నామీద చాలా చిరాకు పడిపోతా, "ఈవిడ నీకు మళ్లీ పాడరు," అన్నారు.

ఆ తర్వాతది నాయుని కృష్ణమూర్తి రాసిన పాట.

లతాజీతో పాటొచ్చిన ఆవిడ చెల్లెలు ఉషా మంగేష్కర్‌కి ఆ భక్తిపాటలో హారర్ బాక్‌గ్రౌండ్స్ స్కీము చాలా నచ్చింది.

ఈ రికార్డింగుల పనవుతూ ఉండగా ఆవేళ మధ్యాహ్నం ఇళయరాజాగారింటికి లంచ్‌కెళ్లారా లతాజీ సిస్టర్స్.

భోజనం చేస్తూ గోడమీదున్న ఆ ఇళయరాజా పెయింటింగ్ చూసిన లతాజీ, "అరె బాగుందే!" అన్నారు.

"చాలా బాగుంది. ఎవరు గీశారు?" అన్నారు ఉషామంగేష్కర్.

వాళ్ల మాటలకి నవ్విన ఇళయరాజా, "గీసిన ఆర్టిస్టు పేరు నాకు తెలీదుగానీ, గీయించింది మట్టుకి నిన్నా మొన్నా రెండు పాటలు పాడారుగదా వంశీకి. వాడు గీయించాడు," అన్నారు.

భోజనం అయ్యాక కుర్చీలోంచి లేచి ఆ గోడ దగ్గరదాకా వెళ్లిన లతామంగేష్కర్‌గారు ఆ పెయింటింగ్‌నే చూస్తూ ఉండిపోతూ, "చాలా బాగుంది," అన్నారు.

ఆ మధ్యాన్నం రమ్మంటూ నాకు కబురుచేసిన ఇళయరాజా, "నా పెయింటింగ్ గీసిందెవరూ?" అన్నారు.

"కడలి సురేష్," అన్నాను.

"అతనితోనే లతాజీ పెయింటింగ్ గీయించు," అన్నారు.

"సరే," అంటా ఆ సురేష్‌కి కబురుచేసి విషయం చెప్పేటప్పటికి నాలుగురోజులు టైము తీసుకున్న

# గోరీ మనోహరి



అతను చాలా గొప్పగా గీసేడు లతామంగేష్కర్ పెయింటింగ్.

దాంతోపాటు అతన్ని కూడా ఇళయరాజా దగ్గరకి తీసుకెళ్లి పరిచయం చేస్తే చాలా మెచ్చుకున్నారాయన.

పెయింటింగ్స్ చాలా బాగా పాక్ చేసిన నేను ఇన్‌చార్జ్ కళ్యాణం దగ్గరకి పట్టుకెళ్తే దాన్నా బొంబాయి ఎలా పంపించాలో ప్లాన్ చేశాడు.

కొన్నాళ్ల తర్వాత నాకు చాలా థాంక్స్ చెబుతా ఆ లతామంగేష్కర్ దగ్గర్నించి ఉత్తరం. ఈ గొప్పదనం నాదేమాత్రం కాదంటా ఆ సురేష్‌కిచ్చేసేనా లెటరు.

*

అరుణాచలం స్టూడియోలో ఉన్న ఆ పూరిల్లు సెట్లో సంగీత వాళ్ల నాన్న, పిల్లల మీద సీన్సు షూట్ మొదలైంది.

నా దగ్గరకొచ్చిన అసోసియేట్ డైరెక్టర్ టివిఎమ్. సింగు, "సంగీతగారు తలకి తెల్లరంగు వేసుకోనంటున్నారు," అన్నాడు.

మేకప్‌రూమ్‌లో ఉన్న ఆవిడ దగ్గరకెళ్లిన నేను, "మీకు ముందే చెప్పాంగదా మీది సుహాసినికి అక్క కేరెక్టరు, ముగ్గురు పిల్లలుంటారు అని. తలకి వైటేసుకోపోతే ఎలాగండీ?" అన్నాను.

"నేను కూడా ముందే చెప్పాను మీ వాళ్లకి... ఎలాంటి కేరెక్టరైనా సరే జుట్టుకి తెల్లరంగు వేసుకోనని," అందావిడ.

"ఎవరికి చెప్పారు... ప్రొడ్యూసర్‌కా?"

"వచ్చినోళ్ల పేరు గుర్తులేదు. చెప్పడం మట్టుకి జరిగింది," అంటా ఆవిడ చాలా నిజాయితీగా చెబుతుంది. కేరెక్టరు చెప్పి ఎంత ఆర్గ్యూ చేసినా ఒప్పుకోటంలేదా సంగీత.

సరే అనుకుంటూ సెట్లోకొచ్చిన నాకు, "ఏంటబ్బాయ్?" అంటా ఎదురొచ్చేడా పి.ఎల్. నారాయణ.

సాక్షి రంగారావూ, ఈ పిఎల్. నారాయణ చాలా గొప్పనటులు. జనం గుర్తించలేదుగానీ సిహెచ్. కృష్ణమూర్తి, సత్తిబాబులాంటోళ్లుకూడా చాలా మంచి నటులే. కేరెక్టరిచ్చి వాళ్లని అందులో ఇన్వాల్వ్ చెయ్యాలంతే. కానీ, వాళ్లు చేసిన పాత వేషాలు గుర్తుపెట్టుకుని అలాంటివే ఇచ్చేరు. మరసలు విషయానికొస్తే చిడతల అప్పారావు ఎంత మంచి నటుడు! అలా గుర్తు చేసుకుంటా ఆ సంగీతగారితో పడ్డ తగాదా మొత్తం మర్చిపోయేను.

"ఏంటబ్బాయ్ పనింకా మొదలెట్టలేదు, ఏంటి లేటూ?" మళ్లీ వచ్చేడు పి.ఎల్.

"ఆ సంగీతగారు రెడీ అయ్యొచ్చాకనే స్టార్ట్ చెయ్యాలి సీను. నీ పూర్తి పేరు చెప్పు బాబాయ్," అన్నాను.

నవ్వేసిన పి.ఎల్. నారాయణగారు, "పుదుక్కోట్టై లక్ష్మీనారాయణన్," అంటా ఆగేడు.

షాకై తూలబోయిన నేను, "అదేంటీ నువ్వు తెలుగోడివి కాదా అయితే?" అన్నాను.

"కాదు, కేరళ," అన్నాడు.

"నాకు నమ్మకం లేదు," అన్నాను.

"నాకూ లేదు."

"ఏదో కామెడీ డైలాగొదిలేవ్ ఏంటీ?" అనడంతో హాయిగా నవ్వేస్తా మొదలెట్టేడా పి.ఎల్. బాబాయ్.

తన చిన్నప్పుడెప్పుడో కేరళనించి బాపట్ల వలసొచ్చిన గొప్ప బ్రాహ్మణ కుటుంబం వాళ్లది.

ఆ ఊరి గడియారం స్తంభం నుంచి సూర్యలంక కెళ్లే దారిలో రామకృష్ణ లంచ్ హోమ్ అని వాళ్లు పెట్టిన హోటలుకి తెగొచ్చేవారు జనం. అక్కడ భోజనమేకాదు పొద్దుట సాంబారిడ్లీ, టిఫిన్లు కూడా మా గొప్ప రుచిగా ఉండేవి.

చీరాలలో చదువుకుంటున్న నారాయణకి నిర్మాత డి. రామానాయుడుగారు క్లాస్‌మేటు. పేరుకి మలయాళపోడైన నారాయణ అద్భుతమైన తెలుగు సాహిత్యం చదువుకుంటా కోన గోవిందరావుగారు రాసిన 'రాజీనామా' నాటకం ప్రదర్శించడం మొదలెడితే రంగస్థలం మీద అతన్ని చూడ్డానికి ఎగబడేవారంట జనాలు. అక్కడ్నించి ఒకటా రెండా బోల్డన్ని నాటకాలు.

అప్పుడప్పుడు మద్రాసొచ్చి రామానాయుడిగారి సినిమాల్లో చిన్నచిన్న వేషాలేస్తున్న పి.ఎల్. నారాయణ నెమ్మదిగా సినిమాల్లో బిజీ అయిపోయేడు.

అతనలాగ చెప్తుంటే వింటా వచ్చిన నాకు, "మరి నీ హాబీలేంటి బాబాయ్?" అన్నాను.

నవ్విన నారాయణని అడక్కుండానే అతని బొడ్లోంచి బయటపడ్డ ఆ క్వార్టర్ బాటిల్ చూసిన నేను, "గొప్ప క్వాలిటీస్ ఉన్న నీలాంటోళ్లకి ఇలాంటి గొప్ప హాబీలుంటాయిలే బాబాయ్," అంటుంటే బాటిల్నే ఇష్టంగా చూసుకుంటా మళ్లీ బొడ్లో దోపుకుంటున్నాడు.

ఇంతలో రెడీ అయిపోయి వచ్చిన సంగీతగార్ని చూస్తే జుట్టుకి తెల్లరంగు తప్ప తక్కిన మేకప్పంతా నేను చెప్పినట్టే చేసుకొచ్చింది. రెప్పార్పకుండా డాగుపడ్డ మామిడి పండులాగున్న ఆవిడ చెంపల్నే చూస్తూ, "మరి మొదలెడదాం," అన్నాను.

*

ఆళ్వార్‌పేటలో ఉన్న ఆ వీనస్ స్టూడియో ఎంట్రన్స్ బిల్డింగ్ చాలా పాతకాలంనాటిది. ముందు జయా ఫిలిమ్స్ అని ఆ తర్వాత శోభనాచల పిక్చర్సని పాత పేర్లున్న ఆ స్టూడియో అసలీనాటిది కాదు.

ఆ స్టూడియో పాత ఎంట్రన్స్ బిల్డింగే ఈ లాయర్ సుహాసినిలో ఇంకో హీరో అయిన రాజేంద్ర ప్రసాద్ ఇల్లు.

కారు దిగిన నేను ఆ బిల్డింగ్ దాటేక కనిపించే ఫ్లోర్ల వెనకున్న వెలగచెట్ల కిందకెళ్లేను.

వెతుకుతుంటే కాయలేం రాలలేదు. పరిమళించే పారిజాతాల్ని నేలరాలాక ఏరుకోవాలి తప్ప, కోసుకోకూడదంట. ఈ వెలగపళ్లు కూడా అంతే. పండి రాలినప్పుడే వాటి రుచి. తెగ వెతికిన నేను చివరికా ఆఫీసు మేడ మెట్లెక్కేను.

రాజేంద్రప్రసాద్‌తో పాటు సుహాసిని కూడా ఉన్న ఆ సీనుకి సంబంధించి మూడు షాట్స్ తీసేక తర్వాత షాట్స్‌లో సుహాసిని లేదు.

కిందాగిన కారులోంచి దిగినా మనిషి ఒక పెద్ద సినిమా ఆల్బమ్ పట్టుకుని పైకొచ్చి మూలమంచ మీ్మద కూర్చున్న హాసినికిచ్చి వెళ్లిపోయేడు. ఆ ఆల్బమ్ ఒళ్లో పెట్టుకున్న ఆ సుహాసిని ఒక్కో షీటూ తిప్పుతా ఫొటోల్ని చూస్తుంటే దగ్గర కెళ్లేను.

మోహనూ, రేవతీ ఉన్నారు. కొన్ని ఫొటోల్లో కార్తీక్ కూడా కనిపిస్తున్నాడు.

ఆ రేవతి తప్ప మిగతా ఇద్దరితో ఇంతకుముందు పనిచేసి ఉండటంతో చూస్తున్న నేను, "ఇదేంటి హాసినీ మన సినిమా ఆల్బమ్ కాకుండా ఇంకేదో చూస్తున్నావూ?" అన్నాను.

నవ్వేసిన సుహాసిని, "ఒక డైరెక్టరు ఇప్పుడు తీస్తున్న ఒక తమిళ సినిమా ఆల్బమ్ పంపిస్తే చూస్తున్నాను," అంది.

"ఈ సినిమాలో నువ్వు యాక్ట్ చేస్తున్నావా?" అన్నాను.


"లేదు," అంటూ నవ్వి, "మీకు ఇష్టమైన ఇళయరాజా దీనికి మ్యూజిక్. పాటలు చాలా బాగున్నాయి," అంది.

అప్పుడే అక్కడికొచ్చిన రాజేంద్రప్రసాద్, "ఈ సినిమా డైరెక్టర్‌తో నిన్నే పెళ్లిచూపులైనాయంట ఈ సుహాసినికి," అన్నాడు.

"అలాగా!... ఆ డైరెక్టర్ పేరేంటి ప్రసాదూ?" అన్నాను.

"మణిరత్నం."

*



తేనాంపేటలో ఎల్డామ్స్ హోటలు దాటేసి, ఎడంపక్కకి తిరిగి కొంచెం ముందుకెళ్లాకా ఆ వీధి చివర్లో వున్న ఆఖరి పాత మేడే చిత్రకల్పనా ఆఫీసు.

అది మ్యూజిక్ డైరెక్టర్ సుసర్ల దక్షిణామూర్తిగారి అల్లుడిగారి ఇల్లంట. దాన్ని అద్దెకి తీసుకుని ఈ చిత్రకల్పనా ఆఫీసు పెట్టేరు రవణగారు.

అక్కడికి ఎప్పుడెప్పుడెళ్దామా అన్న ఆత్రం నాలో.

ఆవేళ మధ్యాహ్నం నే వెళ్లేటప్పటికి పొట్టిగా వుండే సత్యనారాయణ నవ్వుతా ఎదురొచ్చేడు. అతన్ది కాకినాడ. అంతకుముందు ఎమ్. శేషాచలం అండ్ కోలో పనిచేసేడు.

రమణగారు ఇందులో ఉన్నారంటా ఏ.సీ. మిషను తిరుగుతున్న ఆ గది తలుపులు తెరిచి నేను లోపలి కెళ్లిన వెంటనే మూసేసేడు.

"రండ్రండి షూటింగెలా జరుగుతుందీ? నా కథని నా కథలాగే తీస్తున్నారా? మార్పులు బాగా చేసేసేరా?" అన్నారు.

"మీకు చెప్పి చేసిన పెద్ద మార్పు అదేనండీ. సుత్తివేలులాంటి మనిషి అనుకున్న ఆ ముసలి లాయర్ని కుర్రోడ్ని చేసి, దానికి రాజేంద్రప్రసాద్‌ని పెట్టేం," అన్నాను.

కాసేపు అదీ ఇదీ మాటాడాకా, "బాపుగార్ని ఒక టైటిల్ రాసిపెట్టమని రిక్వెస్ట్ చేసేనండీ," అన్నాను.

"వెన్నెల నీడ?"

"అవును సార్."

"రాసి పొద్దుట నాచేతికిచ్చారు," అంటా ఆ సత్యనారాయణ్ణి పిల్చి తెప్పించి నాకిస్తా, "ఇదే పేరుతో భమిడిపాటి రామగోపాలంగారు ఒక కథ రాశారు. దాన్ని మేం సినిమాగా తీద్దామని ఎప్పటికప్పుడు అనుకుంటూ వచ్చాంగానీ ఇప్పటిదాకా తియ్యలేకపోయాం," అన్నారు రవణగారు.

"మీకు బాగా నచ్చిందాండీ ఆ కథ?" అన్నాను.

"అవును. శ్యామల అనే అమ్మాయి తన పెళ్లైన తర్వాత కూడా మంచి సంబంధం తప్పి పోయిందే అని అశాంతికీ, అసంతృప్తికీ గురైన అంశం... ట్రీట్ చేస్తే బాగుంటది అనుకున్నాం. ఖాళీగా వున్నప్పుడు సరదాగా చదివి చూడండి," అంటా చాలా విషయాలు మాట్లాడ్తుంటే వాళ్లు చేసిన లాంచీ ప్రయాణాల గురించి చెప్పమంటా తెగ అడుగుతా వచ్చేను.

అలాగా చిత్రకల్పనా ఆఫీసులో చాలాసేపు గడిపేకా అక్కడ్నించే సీతారామశాస్త్రిగారికి ఫోన్‌చేసి, "ఆ డ్యూయెట్ లిరిక్ ఎంతవరకూ వచ్చింది?" అన్నాను.



"అయిపోయింది వినిపించనా?" అంటూ ఫోన్లోనే సొంత ట్యూన్లో పాడి వినిపించేశాడాయన.

ఆ తర్వాత దాన్ని బాలుగారికి పంపించాను. రెండోరోజు మధ్యాహ్నం, ఎప్పుడూ బాలూగారి కాంపౌండ్లో ఉండే యంగ్ సౌండ్ ఇంజనీర్ రమేష్ ఒక డెమో క్యాసెట్ పట్టుకుని, "మీకిమ్మన్నారు," అంటా ఇచ్చెళ్లేడు.

*దివిని తిరుగు మెరుపు లలన సామజవరగమనా*
*కరుణ కలిగి భువికి దిగెన సామజవరమగనా*
*బతుకు వెలిగె తరుణి వలన సామజవరగమనా*
*చెలిమి కలిమి మరువగలన సామజవరగమనా*

చాలా అద్భుతంగా ట్యూన్ చేసేరు బాలూగారు. నేను రిక్వెస్ట్ చేసినట్టే రకరకాల స్వర భేదాలతో ఫిమేల్ వాయిస్ పాడేలా కట్టిన ఆ వరసలు చాలా బాగున్నాయి. హిందోళరాగంలో ఏది విన్నా మనసే అందాల బృందావనంలాగ అద్భుతంగా వుంటది గాబట్టి ఇది కూడా అంత అద్భుతంగానే వుంది నాకు.

వెంటనే బాలుగారికి ఫోన్ చేసి, "ట్యూన్‌లో ఫిమేల్ వాయిస్ శైలజది కదా? రేపు ఈ శైలజగారితోనే పాటలో కూడా పాడిద్దాం," అన్నాను.

లిరిక్ పార్ట్ అంతా ఆ సినిమాకి పనిచేసిన తార మాస్టర్ వీజీపి గార్డెన్స్‌లో తీస్తే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్స్ కోర్సు వాతావరణంలో నేను తీసేను. అలా షూటింగప్పుడు బ్యాక్‌గ్రౌండ్స్‌లో చాలా ఇష్టంగా వాడిన సోలో వయొలిన్ని నేను ట్రిమ్ చేసేశానని నవ్వుతా తిట్టారా బాలూగారు.

ఇరవై మిరపకాయలు ఏకబిగిన తినేస్తానని భర్త భానుచందర్‌తో పందెం వేసిన సుహాసిని టేక్‌లో నిజంగానే తినేసింది.

షాకైపోయిన నేను ఆ షాటయ్యేకా ఆరాతీస్తే టేక్‌కి ముందు వాళ్ల అసిస్టెంటు సరోజతో మిరపకాయ ల్లోపల గింజలన్నీ తీయించేసిందట. ఇంక కారమేం ఉంటదీ? నా బొంద...

'తక్కువదిగాదీ సుహాసిని,' అనుకున్నాను.

ఆ సీనయ్యేకా బయటికొస్తే సరితతో మాటాడతా కనిపించిందా సుహాసిని.

రెండు మూడు సినిమాలు హీరోయిన్స్ డబ్బింగ్ లకి మాత్రమే పనిచేసినా చాలా ఇష్టం నాకా సరిత అంటే. ఎప్పుడూ చెప్పే అవకాశం రాలేదుగానీ ఆవిడ అభిమానిని నేను.

అదేంటో విచిత్రం నేను వెన్నిరాడై నిర్మలకీ, కృష్ణకుమారికీ, జయంతికీ ఫ్యాన్ని. ఈ సరిత విషయం లాగే వాళ్లెవర్నీ కలిసి చెప్పే అవకాశం రాలేదు.

సుహాసినీ సూర్యప్రకాశరావూ కోర్టునించి తిరిగొస్తుంటే ఒక వీధిలో ఉన్న ఆ ఇంట్లో భార్య ఉరేసుకుందని చెప్పి ఆ భర్త తెగ ఏడుస్తుంటే జీపులో దిగిన పోలీసులు, "ఊరుకో నువ్వు ఎంత ఏడిస్తే మట్టుకి పోయినోళ్లు వస్తారా" అంటా తెగ ఓదారుస్తున్నారతన్ని.

ప్రకాశరావుతోపాటు అక్కడికొచ్చిన సుహాసిని పైనించి వేలాడేతాడూ, స్టూలూ, ఓవర్‌గా నటిస్తున్న ఆ భర్తనీ బాగా పరిశీలించిన తర్వాత వాడే పెళ్లాన్ని చంపేసి ఇలా డ్రామా ఆడుతున్నాడని నిమిషాల్లో తేల్చేసేటప్పటికి వాడ్ని చితకబాదుతూ తీసుకెళ్లిపోయేరు పోలీసులు. అప్పుడే అక్కడికొచ్చిన ప్రెస్ ఫోటోగ్రాఫర్ ఆ సూర్యప్రకాశరావుతోపాటున్న సుహాసినిని ఫోటో తీసుకున్నాడు.

ఆ ఫోటోగ్రాఫర్ వేషం వెయ్యడానికి పాటలు రాసే ఆ సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు సంబరపడితే రమ్మన్నాను. ఎస్సై వేషానికి మొన్న రిలీజైన లేడీస్ టైలర్‌లో జట్కా శీను వేషం వేసిన కర్ణ వచ్చాడు.

తమిళంవాడైన ఆ కర్ణ ఆర్టిస్టు చిలక రాధని పెళ్లి చేసుకుని తెలుగు నేర్చేసుకుని సినిమాల్లో యాక్ట్ చెయ్యడం మొదలెట్టేడు. ఇంకా దొంగ భర్త వేషం, నా ప్రతి సినిమాకీ డబ్బింగ్ ఇన్‌చార్జ్‌గా పనిచేసే తారాకృష్ణ గారొచ్చేరు. దీని తర్వాత, అరుణాచలం స్టూడియోలో ఆ కొత్త విలను రామనాథం, రాజేంద్రప్రసాదూ కొట్టుకునే సీను. ఫైట్ మాస్టర్ లేడు నిజంగా కొట్టుకున్నంత నేచురల్‌గా చెయ్యమన్నానోలేదో తెగ కలబడిపోయేరు.

అలా చేస్తున్నప్పుడు టైమింగ్‌లో తేడా రావడంతో రాజేంద్రప్రసాద్ కాలు విరిగిపోయింది.

ఇటుపక్కన లేడీస్ టైలర్ మంచి హిట్టైన టైములో ఆ ప్రసాదుకలా జరగడం చాలా బాధపడే విషయం. అక్కడ్నించా కాలి సిమ్మెంటు కట్టుతోనే పని చెయ్యడం మొదలెట్టేడతను.

హాస్పిటల్‌లో సుహాసినికి డెలివరీ అయ్యింది.

అది తెల్సినా భర్త భానుచందర్ ఆ భార్యని చూడ్డానికొస్తే ఈ టైములో ఎలవ్ చెయ్యం అంటా గొడవ చేసేరా హాస్పిటల్ స్టాఫ్.

వాళ్లని పక్కకి తోసేసినా భానుచందర్ పెళ్లాన్నీ, ఆ పసిగుడ్డునీ ఎత్తుకు పారిపోతుంటే, ఆ హాస్పిటలు డాక్టర్లూ, నర్సులూ ఆగమంటా వాళ్ల వెనకే పరుగులు.

వాళ్లని ముప్పతిప్పలు పెట్టిన భానుచందర్ వాళ్లకేమాత్రం దొరక్కుండా ఒక గార్డెన్లోకి తీసుకెళ్లిపోయేక సాంగ్.

ఈ ఇమేజినేషన్ సీను ఏ.వీ.ఎమ్. స్టూడియోలో తియ్యడం అయ్యేటప్పటికి చాలా రాత్రయ్యింది.

రేపొద్దుట తియ్యాల్సిందేంటి? అని షెడ్యూలు ప్లాన్ వేసినా అసోసియేట్ సింగ్ గార్నడిగితే, "సినిమాలో వచ్చే మొట్టమొదటి సీను" అన్నాడు.

"తిరునీర్‌మలై... ఆ లొకేషన్ మీకు తెలుసన్నారు గదా?" అన్నాడా అసోసియేట్.

ఔను తెలుసది... నా ఫస్ట్ ఫిల్మ్ మంచుపల్లకీలో ఆఖరి సాంగ్ తాలూకు బిగినింగ్ ఆ కొండమీదే తీశాను.

❇

రాత్రి ఇంటికొచ్చి భోజనం అదీ కానిచ్చేక ఇక పడుకుందామనుకుంటున్న టైములో గుళ్లో గంటలా మోగిందా లేతనీలం రంగు ఫోను.

తనే అరకునించి.

"హలో" అన్నాను.

"అసలు గుర్తున్నానా?"

"మన గాలికొండ ఆంజనేయస్వామిమీదొట్టు. ఎందుకు గుర్తులేవూ?"

"మరి ఉంటే ఇలాగా మీరు ప్రవర్తించేదీ?"

"రాత్రీ పగలనక పని."

"అంతా చెయ్యడంలేదా?"

"ఆళ్లొకటే చేస్తారు కానీ అన్నీ నెత్తిమీద వేసుకుని చాలా చెయ్యాలి నేను. ఈ ఫీల్డు మనిషివి కాదుగాబట్టి నీకేం తెలీదు."

'ఔను' అంటూ ఆగినా మనిషితో ఆ రాత్రెంత సేపు మాట్లాడాల్సొచ్చిందో... ఎప్పుడో పడుకుని తెల్లవారుఝామునే లేచిపోయేను.

నగరానికి చాలా దూరంగా ఎక్కడో ఎత్తు మీదున్న ఆ తిరునీర్‌మలై కొండ మీద గుళ్లో షూటింగు. వెళ్తుంది కారు. బయట చీకటి. నిద్రపోదామంటే రావడంలేదు. నాకిష్టమైన వైజయంతిమాలలాగుండే ఆ మనిషే గుర్తుకొస్తుంది. ఆ మనిషితో రాత్రి మాటాడిన మాటల్లోంచి కొన్ని ముక్కలు గుర్తు కొస్తున్నాయి. అలా వస్తూనే వున్నాయి.

కారు దిగుతుంటే ఎదురొచ్చిన అసోసియేట్ డైరెక్టర్ సింగ్, "చాలా పెద్ద సీను సార్. ముందు కింద ఫినిష్ చేసి కొండమీదికెళదామా?" అనేసి అటూ ఇటూ పరుగెడ్తున్నాడు. స్క్రిప్టుతోపాటొచ్చిన తనికెళ్ల భరణిగారు మొత్తం సీను చదివి వినిపించి ఒక కాపీ నాకిచ్చి వెళ్లిపోయేడు.

వాళ్ల పొలం తాలూకు శిస్తు వసూలుచెయ్యడానికి గుమాస్తా మూర్తితో పాటే పల్లెటూరొచ్చేడు హీరో భానుచందర్. సుహాసిని అనే చదువుకున్న అమ్మాయి కావాలని ఆ రౌడీలాంటి గవర్రాజుని పెళ్లి చేసుకుంటుంటే ఒద్దు బాబోయ్ అంటూ ఆ పెళ్లి ఆపే ప్రయత్నం చేస్తుందాళ్ల అక్క.

"ఏంటిదంతా?" అన్నాడు భానుచందర్.

"ఈ గవర్రాజుగారు నా చదువుకి పదివేలు అప్పిచ్చారు. అది తీర్చలేక ఈయన్తో తాళి కట్టించుకుంటున్నాను," అంది సుహాసిని.

మధ్యలోకొచ్చి వాళ్లని ఎదిరించినా భానుచందర్ ఆ సుహాసిన్ని పెళ్లి చేసుకుని, ఆమె కుటుంబీకులతో సహా వాళ్ల సిటీకి తీసుకెళ్లిపోయేడు.

పొద్దుటే మొదలెట్టిన సీను ఎప్పుడో పొద్దోయాక పూర్తయ్యేకా కారెక్కుతుంటే పరుగెట్టుకుంటూ వచ్చినా సింగ్‌గారు రేపు ఏవీఎమ్ కోర్టు సెట్లో సాంగ్ అన్నాడు.

"సరే," అన్నాకా కారు బయల్దేరిందా చీకట్లో. డ్రైవర్‌కి రేపు తియ్యబోయే సాంగ్ క్యాసెట్ ఇచ్చి ప్లే చెయ్యమన్నాను.

*మహరాజా మర్యాదా నీ రాక ఈనాటికా*

*నా లేఖా చేరాకా ఆరాటమే తీరగా బదులేమి రాలేదుగా*

ఆ పాట వింటూనే నిద్రపోయే ప్రయత్నం చేస్తున్నానుగానీ అసలది వస్తే గదా?

ఢిల్లీ వెళ్లిన లాయరు భర్త భానుచందర్‌కి ఎన్ని ఉత్తరాలు రాసినా ఎలాంటి జవాబు రాకపోయేటప్పటికి ఈ భార్యయిన లాయర్ సుహాసిని చంటిబిడ్డతో తను ఊహించుకునే ఒక చిలిపి రొమాంటిక్ సాంగ్.

హద్దులూ, ఆపులూ, లోతులూ ఊహలకి ఉండవు గాబట్టి ఇష్టానికి ఆలోచించుకుంటూ పోతున్నాను. అసలెక్కడికెళ్లిపోతున్నానో నాకే తెలీటం లేదు.

వీధిలో అందరికీ ఉత్తరాలిస్తున్న ఆ పోస్ట్ మేన్ తన పక్కకి కనీసం ముఖం తిప్పి కూడా చూట్టంలేదు.

ఎదురుచూస్తూనే ఉన్న సుహాసిని ఎన్ని రోజులైనా అలా ఓర్చుకుంటూనే చూస్తుంది.

అలా చూసి చూసినా మనిషి, ఆవేళ కూడా ఇంక ఇన్లాండ్ లెటరు రాదనేసి నీరసపడిపోతా లోపలికెళ్లబోతుంటే 'ఒహోం ఒహోం' అంటూ బోయీలు రాజుగారి పల్లకీ మోస్తున్న అరుపులు.

చిన్నప్పుడెప్పుడో వాళ్ల పల్లెటూరైన ఆ కొప్పవరంలో విన్న ఈ అరుపులు. ఇదేంటీ సిటీలో? అనుకుంటూ మెట్ల దగ్గరికి పరిగెట్టుకొచ్చి చూస్తే విచిత్రం-

ఏడెనిమిదిమంది పోస్ట్‌మేన్లు జన్మలో ఎప్పుడూ చూడ్నంత పెద్ద సైజు ఉత్తరాన్ని తలో పక్కా నెత్తిమీద

పెట్టుకుని మోసుకుంటా వస్తుంటే ఈ ఏరియా పోస్ట్ మేన్ వాళ్లకి దారి చూపిస్తున్నాడు.

వాళ్ల ఇంటి మేడ మెట్లెక్కొచ్చేసి ఆ నిలువెత్తు ఉత్తరం హాల్లో పెట్టి వెళ్లిపోయేరు.

దీంట్లో ఏముంది? అసలు దీన్నెలాగిప్పాలా అంటా ఆపసోపాలు పడిపోతున్న ఆ సుహాసిని సుత్తీ సేనం తీసుకొచ్చి వాళ్ల పిల్లల సాయంతో ఆ ఉత్తరం నాలుగు మూలలా ఓపెన్ చేసేటప్పటికి దాంట్లో పడుకున్న భానుచందర్ పార్సిలు చేసిన ఆ రంగు కాయితాల కటింగుల్ని దులుపుకుంటా పైకి లేస్తుంటే మతిపోయినట్టు చూస్తున్న ఆ సుహాసినికి మాటలు పడిపోయినియ్యి.

అలా దులుపుకుంటా లేచినా భానుచందర్ చేతిలో చిన్న ప్యాకెట్ ఉంది. ఇష్టంగా దాన్ని భార్య కందించేడు.

ఏంటా అనుకుంటా విప్పింది.

ఆ నల్లంచు తెల్లచీర నిండా బోల్డు రాతలు. అన్నీ విరహానికి సంబంధించిన రవీంద్రనాథ్ టాగోర్ గీతాలే.

ముఖం అయిష్టంగా పెట్టుకున్నా పరమిష్టంగానే ఆ చీర కట్టుకుని దానిమీద కోర్టు గౌనేసుకున్న సుహాసిని చంటోడ్నెత్తుకునెళ్తుంటే వెనకాలే లాయరు బట్టల్లో ఆ భానుచందర్.

ఒకళ్లెనకాల ఒకళ్లా మెయిన్‌రోడ్డెక్కి స్లో మోషన్లో పరుగెడ్తుంటే విచిత్రంగా చూస్తున్నారా జనాలు.

అలాగే కోర్టుదాకా వచ్చేసేటప్పటికి అక్కడి జనాలు కూడా ఆ వైపులోనే చూస్తా మాటాడు కుంటున్నారు.

"పెన్నులో ఇంకు బదులు కన్నీళ్లు నింపుకుని ఉత్తరాలు రాస్తుంటే ఒక్కదానికీ సమాధానం లేదు. మిమ్మల్ని ఫలానా ఒన్ ఫోర్ త్రీ సెక్షన్ కింద చాలా దారుణంగా శిక్షించాలి," అనేసి జనం నిండిపోయున్న ఆ కోర్టు ముందు చాలా ఆవేశంగా వాదిస్తుంది. అదేం పట్టించుకోని భానుచందర్ ఆమె ఎత్తుకున్న కుర్రోడి బిస్కెట్ల పొట్లం లాగేసుకుని తినేస్తున్నాడు. అది చూసి నీ పని చెపుతానుండు అని సుహాసిని అలా... ఆ జడ్జి గారు సుత్తి పట్టుకుని చాలా కోపంగా సైగలు చేస్తున్నాడు.

ఇంతలో గుక్క తిప్పుకోకుండా ఏడ్డం మొదలెట్టినా చంటోడ్ని ఒక పక్కనించి ఊరుకోబెడతానే రొమాన్సులోకి దిగిపోయారాళ్లిద్దరూ. అది చూసినా కోర్టులో జనాలు నెత్తీ నోరూ బాదుకుంటా స్లోమోషన్లో పారిపోతుంటే ఇంకో పక్కనించి చీకటి పడిపోయింది.

పండు వెన్నెల కిరణాలు కిటికీలోంచొచ్చి ఆ కోర్టులో పడ్తుంటే ఆ కోర్టు హాలు నడిమధ్య పొడుగాటి తాళ్లతో ఉయ్యాల కట్టి ఊపుతుంది సుహాసిని. కుర్రగాడు ఆడుకోడానికి బొమ్మలు తెచ్చిన భానుచందర్ ఆ పని పక్కనపెట్టి పెళ్లాం జబ్బ నిమిరే పనిలో పడ్డంతో విసురుగా లేచిన సుహాసిని అతన్ని తరమడం మొదలెట్టిందా వెన్నెల మరకలు పడ్తున్న కోర్టులో.

ఆమెకి దొరక్కుండా బోనులోకెళ్లి నిలబడ్డ భానుచందర్, 'భగవద్గీత మీద ఒట్టేసి చెపుతున్నాను నా ప్రేమ నిజం,' అంటా పాడతా ఆ సుహాసిని దగ్గర దగ్గరకి మరీ మరీ దగ్గరకొచ్చేస్తుంటే జడ్జి చెయిర్లో







కూర్చున్న చంటిపిల్లోడు, 'ఆర్డర్... ఆర్డర్' అంటూ సుత్తితో బాదుతున్నాడు.

ఆ ఏవీఎమ్ స్టూడియో కోర్టు సెట్లో ఇలాగ పాట తీస్తూ ఆ సాయంత్రం టిఫిన్ బ్రేక్ ఇచ్చిన టైములో మూడు కార్ల నిండా జనం దిగారు.

చూస్తుంటే చాలా బలంగా ఎత్తుగా కనిపించే రాళ్లు. కొందరైతే పెద్ద పెద్ద మీసాల్తో, పొడుగాటి జుట్టుల్తో వున్నారు. వాళ్ల మధ్య సన్నగా పొట్టిగా తెల్ల బట్టలేసుకుని అమాయకమైన ముఖంతో ఉన్న ఓ మనిషున్నాడు.

ఆ సెట్లోకొచ్చిన వీళ్లంతా సరాసరి ఆ భాను చందర్ దగ్గరకెళ్లి తెగ మాట్లాడేస్తున్నారు.

చిత్రమేంటంటే అంతా అలాగ మాట్లాడేస్తుంటే సన్నగా కురసగా వున్నాయన వింటూ ఎప్పటికో ఒక మాట మాట్లాడ్తున్నాడు భానుచందర్‌తో.

సెట్ బయటికొచ్చేసిన నేను నైట్‌లో మూన్‌లైట్ పార్ట్ ఎలా తియ్యాలన్న విషయం మీద ఆలోచిస్తూ అటూ ఇటూ తిరుగుతుంటే ఆ గాలికొండపురం రైల్వే గేటు ప్రొడ్యూసరైన సుబ్రమణ్యంరాజుగారొచ్చి,

"వచ్చేవారమేవన్నా మనం అరకు వెళ్లడం కుదురు ద్దాండీ?" అన్నాడు.

"ఎన్ని రోజులూ?" అన్నాను.

"వెళ్లిన పని కాస్తన్నా అవ్వాలంటే పదిరోజులన్నా ఉండాలిగదా అక్కడా?" అన్నాడు.

"ఔనౌను ఉండాలి. కానీ ఇక్కడీ సినిమాపని మధ్యలో వదిలేసి రావడం కుదరదుగదా రాజుగారూ?" అన్నాను.

"పోనీ వచ్చే నెల పెట్టు కుందామా ప్రోగ్రామూ?" అన్నా డాయన.

"ముందీ సినిమా అయిపో నియ్యండి. ఈలోగా టైము దొరికి నప్పుడల్లా ఆలోచిస్తాను," అన్నాను.

ఆ తర్వాత కాస్సేపు అదీ ఇదీ మాటాడ్లాక ఆయనెళ్లిపోయేరు.

బ్రేక్ టైమయ్యింది.

ఆ గుంపుతోపాటు బయటికొచ్చిన భానుచందర్ నన్ను పిల్చేటప్పటికి దగ్గరకెళ్లేను.

తెల్లబట్టలాయన గురించేదో చెప్పిన ఆ భాను చందర్, "నాతో ఒక ఫిల్మ్ చేసే పనిమీద మాట్లాడ్డాని కొచ్చారు," అన్నాడు.

ఆ తెల్లబట్టల సన్నటాయన అందంగా నవ్వుతూ షేక్‌హ్యాండ్ ఇస్తుంటే బూరుగుదూదిలా మెత్తగా వున్నాయి ఆయన చేతులు.

వాళ్లెళ్లిపోయాక సెట్లోకెళ్లిపోతున్న భానుచందర్ని వెనక్కి పిల్చిన నేను, "ఆ మనిషి పేరేదో చెప్పి ఆయన గురించి చాలా ఘనంగా చెప్పేవుగానీ ఆ జనం రొదలో సరిగ్గా వినిపించలేదు. ఇప్పుడు చెప్పు భాను, ఎవరాయన?" అన్నాను.


సౌండ్ రాకుండా నవ్వినా భానుచందర్ మళ్లీ చెప్పాడు,

"ఆయన వంగవీటి మోహనరంగా."

ఐపోలేదింకా...

❖ *Abhinuta Maddukuri*

# Hamlet: A Tragic Hero



*Tragedies in literature have a long and rich history across cultures since ancient times. The roots of tragedies in Western literature can be traced back to the theatrical performances of the ancient Greeks in the 5th century BCE. These plays were performed during religious festivals to honor the Greek god Dionysus, the god of wine, fertility, and dramatic arts.*

*The ancient Greek philosopher Aristotle defined tragedy in his work 'Poetics.' According to Aristotle, tragedies aim to evoke fear and pity in the audience, with a defining characteristic being the tragic hero, the protagonist of the story. He defined a tragic hero as a man of noble birth with heroic qualities whose fortunes change due to a tragic flaw that ultimately brings about the hero's suffering or defeat.*

*Though the earliest playwrights of tragedy include those such as Sophocles and Euripides, tragedies written by Shakespeare during the Renaissance earned their place in the most notable works of Western literature. One of Shakespeare's most significant tragedies is Hamlet, with Prince Hamlet becoming an exemplary tragic hero.*

*In this essay, we explore the story of Hamlet through the stages and characteristics of a tragic hero's journey. The Greek terms used by Aristotle for these characteristics (and their meanings) are given below:*

*Hubris: excessive pride in himself or his actions*

*Hamartia: a tragic flaw that causes errors in judgment*

*Peripeteia: a reversal of fortune due to the hero's own poor choices*

*Anagnorisis: the hero's recognition of his tragic flaw and reversal of fortune*

*Nemesis: the hero's inescapable downfall (and usually death)*

*Catharsis: a cleansing or purging of emotion-what the audience feels after the tragic hero has learned the important lesson from his downfall*

Revenge and retribution often play significant roles in tragedy, constituting the thin line between life and death in a tragic hero's journey. In the drama, Hamlet, by William Shakespeare, these ideas take control of not only the tragic hero, Hamlet, but other characters as well to create an environment of death and despair fueled by arrogance. Prince Hamlet, whose thoughts may be observed through soliloquies along with other aspects of the play, provides an understanding that though one may ultimately achieve one's goal, a chosen path of arrogance and inaction to achieve said goal may lead to the downfall of a potential hero and ultimately cause their suffering and anguish.

Hamlet's eventual descent can be predicted from his earlier actions in the play, where his lack of focus towards his goal along with his inability to act sets him up for failure. At this point in the play, the hamartia stage of a tragic hero is portrayed, with Hamlet's indecisiveness and arrogance serving as fatal flaws which will ultimately seal his fate. In this story, hubris and hamartia go hand in hand, as Hamlet's excessive pride is his fatal flaw which leads him on a destructive path. Hamlet's wavering thoughts and overall distractedness from the objective at hand is apparent early on in the story.

After he speaks to his father's ghost, he pledges his devotion to his father's cause in

the second soliloquy, saying "And thy commandment all alone shall live within the book and volume of my brain" (Shakespeare Act 1). However, soon after doing so, he condemns his mother, calling her a "most pernicious woman," (Shakespeare Act 1) contradicting his previous words and his father's wishes. Hamlet's belief that he knows best prevails over his want to follow his father's wishes, leading to an unclear and fluctuating mindset, which prevents him from taking any effective action.

His inability to act can clearly be observed in the fourth soliloquy when he is presented the opportunity to kill Claudius but chooses not to, saying "No. Up, sword, and know thou a more horrid hent: When he is drunk asleep or in his rage; Or in the incestuous pleasure of his bed" (Shakespeare Act 3). Despite Hamlet knowing that Claudius is responsible for his father's death and also being aware of his father's wish to be avenged, he still wastes this opportunity because he does not want to risk his uncle being sent to heaven instead of hell. His inaction at this time proves to be fatal for him in the future, and it may be observed that if he took this opportunity, he nor the other characters would experience as much despair as they are ultimately forced to.



Once Hamlet begins to take action, he does so ineffectively, hurting those close to him and further fueling his eventual downfall. The peripeteia and anagnorisis stage of Hamlet's story can be observed, where his destructive actions continue with less and less hope of a salvageable ending to his journey and the recognition that he only has himself to blame for it. The moment which truly shows Hamlet's moral decline is his killing of Polonius and his subsequent handling of the situation.

Polonius, though meddlesome and irritating, is never a person of genuine threat to Hamlet or someone who is perceived as someone who (morally) should die in the play. Though it can be argued that Hamlet assumes he is killing Claudius, it is his indifference to the situation afterwards which truly portrays his moral decline. Upon the realization that he killed Polonius instead of Claudius, Hamlet says, "Thou wretched, rash, intruding fool, farewell" (Shakespeare Act 3). Though Claudius may be perceived as intruding and rash, he is not someone who Hamlet would ever seek out to kill, which shows how vengeance and revenge have changed him into someone unrecognizable,

who no longer cares about the harm he is causing to those innocent people around him.

His role in Ophelia's descent into madness and her eventual death serves as an extension to this point as well. The same Hamlet who is once in love with Ophelia and cares for her greatly devolves into the Hamlet who humiliates her and leaves her fatherless, ultimately causing her misery and indirectly her death. Though he is aware that he is harming so many around him, Hamlet continues on a guilt-stricken path of anger and violence to avenge his father.

His resolve can be seen in the seventh soliloquy, in which he is reflecting after he sees Fortinbras' devotion to what he believes is a futile cause (fighting for an unimportant piece of land in Poland). Hamlet feels ashamed of his own inability to act regarding his father's death - a worthy cause. He concludes the soliloquy, saying "O, from this time forth My thoughts be bloody, or be nothing worth" (Shakespeare Act 4). Though his past actions have been detrimental, Hamlet continues to feel that he has not been aggressive enough in his attempt to serve justice. Furthermore, instead of devising a rational and effective plan to achieve his goal, he delves even deeper into the mindset of brute force and violence, again showing how his arrogance and ineptitude leads to the demise of himself and those around him.

Eventually, Hamlet's descent reaches its climax as he is forced to face the consequences for his past actions and the realization that he will also be destroyed in the process. It can be said that during this portion of the play, Hamlet reaches the nemesis (and catharsis) stage of the tragic hero. The most prominent situation which exemplifies this is Hamlet's realization that he is dying, when Laertes says "It is here, Hamlet. Hamlet, thou art slain" (Shakespeare Act 5).

Hamlet's death is the culmination of all his past decisions harming those who cared for and loved him, and he now recognizes there is nothing he can do to alter his fate. As Prince Hamlet's journey comes to its resolution, the kingdom of Denmark also comes to its conclusion, with Fortinbras' army storming the walls of Elsinore to seize control. In his last words, Hamlet says "But I do prophesy the election lights On Fortinbras," (Shakespeare Act 5) adding that "He has [his] dying voice" (Shakespeare Act 5). Hamlet comes to terms with the fact that his actions have not only caused his own demise but the demise of something much larger, the kingdom of Denmark.

Fortinbras serves as a foil character to Hamlet throughout the play, serving to show how they are in similar situations but have drastically different approaches to their respective missions. The resolution of the play goes to show that those who are strong-willed and headstrong (like Fortinbras) will ultimately achieve their goal and have a positive ending, as opposed to those who are indecisive and arrogant (like Hamlet), only leading ultimately to suffering and despair.




*అభినుత యూటీ ఆస్టిన్ లో మొదటి సంవత్సరం చదువుతున్నారు. సినిమాలు, షికార్లతో బాటు పాటలు వినటం, స్నేహితులతో గడపటం ఇష్టం. సైన్స్ విద్యార్థిని అయినప్పటికీ చరిత్ర, జాగ్రఫీ మొదలైన హ్యూమానిటీస్ సబ్జెక్ట్‌లలో కూడా ఆసక్తి ఉంది.*

కథ



* పాపినేని శివశంకర్

# కవిత్వం వర్ధిల్లాలి!





**కవిత, కథ, సాహిత్య విమర్శ- ఈ మూడు ప్రక్రియల్లోను రచనలు చేసే పాపినేని శివశంకర్ *కవితా ఓ కవితా!*, *రైతు కవిత*, *విస్మృత కథ*, *వార్షిక కవితా* సంకలనాలకు ప్రధాన సంపాదకులు. ఆరు కవితాసంపుటాలు, మూడు కథాసంపుటాలు, ఏడు విమర్శనాగ్రంథాలు, *తల్లీ నిన్ను దలంచి* ప్రాచీన పద్య వ్యాఖ్యాన గ్రంథం రచించారు. ఇవికాక *అంకుర* పద్యకవితాసంపుటి, ఆధ్యాత్మిక విశ్లేషణ *వేదవ్యాసం* వెలువరించారు. *రజనీగంధ* కవితాసంపుటికి 2016లో కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. నివాసం గుంటూరు.**

*చే*తిలో గ్లాసు విసిరికొట్టాడు సీనియర్ కవి.

*"అబ్బాయ్! వామనా! నువ్వు కవిత్వంలోనూ వామనుడివే. మరి నిన్నెందుకు ఆకాశాని కెత్తేశాం? సభానంతరం ఫస్ట్ క్లాస్ పార్టీ ఇస్తావనే గదా? ఇంతా జేస్తే ఈ చెత్త బ్రాండ్ తెప్పిస్తావా? పత్రికలో నీమీద మాంచి సమీక్ష రాద్దామనుకున్నా. కాన్సిల్," అన్నాడు కళ్లెర్రజేసి. ఖరీదైన హోటల్ గది. పది పన్నెండుమంది చిన్న, పెద్ద సాహిత్యకారులు.*

*కవి వామనమూర్తి కంగుతిన్నాడు. తక్షణం వాళ్లకి నచ్చిన, మెచ్చిన పానీయాలు తెప్పించాడు. ఆ విధంగా 'అక్షర మూలుగు' పుస్తకావిష్కరణ సభానంతర సభ రసభరితమైంది.*

*...చదువరీ! ఒక పరి ఇటు రమ్మా...*

**తొలి మెట్టు**

ఎదుగూబొదుగూ లేని ఉద్యోగ జీవితంలో వామనమూర్తి. యాంత్రికత తప్ప మరేమీలేదు. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు రావాలని ఒకే ఒక్క కోరిక. అల్లప్పుడు మేనేజ్‌మెంట్ కళలో చెయ్యి తిరిగిన మిత్రుడు మోహనరావు చెప్పాడు, 'చక్కని రాజమార్గములుండగా సందుల దూరనేల,' అని. (అప్పుడప్పుడు వామనమూర్తి నుంచి ఆర్థిక సహాయం పొందుతున్న కృతజ్ఞత అతనిది.) కవిగా కీర్తి గడించటం కాగితమంత తేలిక.

కృషితో నాస్తి దుర్భిక్షమ్. ముందుగా నాలుగు పద్యాలు చదివి మొదలుపెట్టొచ్చు. వేమన ఉండనే ఉన్నాడు. ఒకపూట కష్టపడగా, 'మేడిపండు చూడ మేలిమై యుండును...' అనే బాణీలో, 'అగ్గిపెట్టె చూడ అందంబుగా నుండు / పొట్ట విప్పి చూడ పుల్లలుండు,' అని రెండు పాదాలు బయటపడ్డాయి. నాల్గో పాదం 'విశ్వదాభిరామ! వినుర వేమ!' ఉండనే ఉందాయె. కానీ మూడో పాదమే ముందుకు పోకుండా మొరాయించింది.

ఇక అస్త్రసన్యాసం చేద్దాం అనుకుంటుంటే, మళ్లీ సలహా ఇచ్చాడు మిత్రుడు.

"కవిత్వం దేముందోయ్! నాలుగు ఆటోల వెనక తిరిగినా బోలెడు వాక్యాలు దొరుకుతాయి. వచన కవిత్వం రాయి. అందులో ఛందో బందోబస్తులేమీ ఉండవు. 'తలుపు వేశాను,' అంటే వచనం. 'వేశాను తలుపు,' అంటే కవిత్వం. 'వేశాను తలుపు చప్పుడు కాకుండా/ చేశాను స్నానం తోడు లేకుండా.' ప్రాస కూడా కుదిరింది చూడు. ఇది కవిత్వం కాదన్న మాదన్న ఎవరో రమ్మను. ఇక నీలాంటి కృషీవలులకి మంచినీళ్ల ప్రాయం."

ఏతత్ ప్రేరణతో నాలుగైదు వచన కవితా సంపుటులు తిరగేశాడు వామనమూర్తి. 'ఓస్! ఇంతే గదా!' ఇక సందేహించలా. 'కవిని నేను / కాళిదాసుకు వారసుణ్ణి నేను,' అంటూ మొదలుపెట్టాడు.

"అబ్బే! మోడరన్ కవిత్వం అంటే అర్థమై, కానట్టుగా ఉండాలి," అని చప్పరించాడు స్నేహితుడు.

లో...తుగా ఆలోచించాడు వామనమూర్తి.

*ఈ రాత్రి నా పెదాలు మూడు కుట్టుకుంటూ*
*పదాల పరదాలు చుట్టుకున్నాను*
*కాళ్లు లేని ఆకాశం కారునలుపు తాబేలై*
*నా ఊదారంగు ఆలోచనలో దూరింది*

"వండర్‌ఫుల్," అన్నాడు మిత్రుడు.

"అంత బాగుందా?" అడిగాడు వామనమూర్తి చేటంత మొహంతో.

"అబ్బే, బొత్తిగా అర్థం కావటంలా. అందుకే బాగున్నట్టు లెక్క. అర్థం, అన్వయం పాత చింతకాయ పచ్చడి. అర్థం కానప్పుడే అందులో లోతుగా ఏదో ఉందనుకుంటారు. కాసిని ఇంగ్లీషు మాటలు, సాఫ్ట్ పోర్న్ మోహాలు కూడా దట్టించు. ఇదే సరికొత్త ట్రెండ్."

అట్లా నాలుగైదు కవితలు పత్రికలకి పంపాడు. ఫలితం సున్న. పేరొస్తేనేగాని పత్రికల్లో పడవు, పడితే గాని పేరు రాదు. ఏది దారి? ప్రముఖ పత్రిక సంపాదకుడిని కలిసి, 'నా అంత కవిని నేను కదా, ప్రోత్సహించటం మీ ధర్మం కదా,' అని విన్నపం చేశాడు. 'నిజమే, మిమ్మల్ని మించి ఎదగండి, తప్ప కుండా వేద్దాం,' అని జవాబు వచ్చింది. ఆ మాట అర్థం కాలా. ఏమీ తోచలా.

'ఏద్కైనా కొత్త ప్రకియలో రాస్తే తేలిగ్గా గుర్తింపు వస్తుంది గదా?' 'అదెలా?' 'ఇలా.'

అటు చూస్తే మీ బెజవాడ
ఇటు చూస్తే మా గుంటూరు
కానీ - బట్ - కానీ
నడిమధ్యలో ఎవరిదీ కాని మంగళగిరి


'ఇట్లా నాలుగు లైన్లుగా కట్ చెయ్యటమే ముఖ్యం.' 'మరి ప్రక్రియకి పేరు?' 'ఏముందీ? 'కానీ/కాణీ' అని పెట్టేస్తే సరి'.

ఆ ప్రకారంగా కొన్ని 'కాణీ'లు వెలువడ్డాయి. మిత్రవర్గం నుంచి, 'బాగుంది కానీ/ణీ, ఇదా కవిత్వ మంటే?' అనే పెదవి విరుపు దక్కింది.

అయినా కానీ, ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌లు ఉండగా దిగులేల? వెంటనే ముఖంకానీ, పుస్తకంకానీ లేని 'ముఖపుస్తకం'లో అసంఖ్యాక మిత్రుల్ని పోగేసుకొని, కవితలు పెట్టసాగాడు. పెద్దగా లైకులు రాలేదు.

"నువ్వు వామనమూర్తిగాక వామనరాణివనుకో, హీనపక్షం వెయ్యెన్నొక్క కామెంట్లు, దానికి రెట్టింపు లైకులు వచ్చి ఉండేవి. అయినా పట్టు వదలకు, కలం దించకు. అవతల కుర్ర పురస్కారం నీకోసం ఎదురు చూస్తుంది. ఒత్తులూ పొల్లులూ తెలీనివాళ్లు కూడా వాటి కోసం యమర్జంటుగా పుస్తకాలు వేసేస్తున్నారు. ఆల్ ది బెస్ట్. మై హూ నా?" అన్నాడు మిత్రుడు. 'సర్వీస్ ఛార్జీల' కింద పదివేలు పుచ్చుకున్నాడు.

వామనమూర్తిలో కవి విజృంభించాడు. ఏడాదిలో



తయారైన కవితలన్నీ కలిపితే తొంభై తొమ్మిది తేలాయి. ఇంకొక్కటి చేర్చి కవితాసంపుటి వెయ్యొచ్చు. ఏదైనా పోటీ కోసమో, అర్జంట్ కవి సమ్మేళనంలో చదవ టానికో, అంత్యప్రాసల్తో బరబరా గీసే యమర్జంటు కవిత, 'కాణీ' వచ్చేసింది, రుబాయత్ ఫక్కీలో.

*ఇప్పుడే గదా వచ్చింది ఇంటికి*
*ఇంకా ముగింపు కాలేదు వంటకి*
*ఈ రాత్రి కవిత నా తలుపు తట్టకపోతే*
*నిద్ర వస్తుందా కంటికి?*

స్నానానికి వెళ్లి వస్తుంటే శ్రీమతి చేతుల్లో ఉంది కవిత.

'వంటెప్పుడో అయ్యింది లెండి. 'రాత్రి-కవిత-తలుపు తట్టటం'. ఊహు. బాగుంది కానీ/ణీ, ఇంతకీ ఎవరండీ ఆవిడ?''

చురచుర చూపులకి అయోమయం చూపుల్తో బదులిచ్చాడు వామనమూర్తి. ఇక కవితాసంపుటి పేరు. తిలక్ కవిత (ఎవరో అన్నది, విన్నది) గుర్తొచ్చింది. 'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు'. ఆ స్ఫూర్తితో చాలసేపు ఆలోచించాడు. నూరు కవిత ల్లోవి కలిపితే పాతికవేలన్నా అక్షరాలు తేలతాయి. కనుక 'అక్షరాలు పాతికవేలు' అంటే? 'కవితలు కచ్చితంగా నూరు' అంటేనో? లేదు. అక్షర శబ్దం రావాలి శీర్షికలో. 'అక్షర ధ్వని', 'అక్షర ధన్వి', 'సువర్ణాక్షరం' మొదలైన పేర్లన్నీ ఆలోచించాడు. కవితల నిండా తన వేదన విరుచుకుపడింది గనుక, చివరాఖరికి 'అక్షర మూలుగు' అనే పేరు ఖాయ మైంది. 'అచ్చంగా కవిదే' అని టాగ్ లైన్. తన ఊహా శక్తికి శ్రీమతి కూడా ముచ్చటపడుతుంది గదా అనే ఆశావహ దృక్పథంతో చెప్పాడు.

''ఊ,'' అంది శ్రీమతి చిరాగ్గా, 'నా మొహంలా ఉంది' అని స్వగతంగానూ.

'ఊ' అంటే మూలుగే గదా! అంటే తనకీ నచ్చిందన్న మాటే. ఇక అడిగీ అడగటమే తడవుగా పీఠికల స్పెషలిస్ట్ అయిన సీనియర్ రచయిత ముందు మాట రాసిచ్చాడు.

''పుస్తకం అన్నాక నలుగురు కవుల్నీ, నూటొక్క శ్రోతల్నీ పోగేసి ఆవిష్కరణ పెట్టకపోతే ఏం బాగుంటది? ప్రింటింగ్ తొందరగా కానియ్. తక్కిన సంగతి నాకు వదిలెయ్. మై హూ నా?'' అన్నాడు మోహన మిత్రుడు.

వారంరోజుల్లో పుస్తకం వచ్చేసింది, నదరైన ముఖ చిత్రంతో. ఒకప్పటి పుత్రోత్సాహం కంటే పుత్రికోత్సాహం పొంగి పొర్లింది. మిత్రుడు వెంటనే రంగంలోకి దిగాడు. ఆరోగ్యశాఖా మంత్రి ముఖ్య అతిథిగా పుస్తకావిష్కరణ. ప్రముఖ వ్యాపారవేత్త విశిష్ట అతిథి, నగర సాంస్కృతిక సంస్థ కార్యదర్శి గౌరవ అతిథి, సదరు సీనియర్ కవి ఆత్మీయ అతిథి, మరో జూనియర్ కవి అదనపు అతిథి. వేదిక మీద పట్టుమని పది పదిహేనుమంది వక్తలైనా తొక్కిసలాడకపోతే ఎలా? మిత్రుడి అక్షర ప్రేమకి వామనమూర్తి కళ్లు చెమర్చాయి.

ఆవిష్కరణ సభ. మంత్రిగారి రాకవల్ల, మోహన రావు సమాచార సంబంధ నైపుణ్యంవల్ల హాలు నిండి పోయింది. ఆవిష్కరణ మంత్రిగారే చేస్తున్నా వేదిక మీద అందరూ తలో పుస్తకం చేత బట్టుకుంటేగాని వల్లగాదన్న మీడియా ఆనవాయితీ పాటించబడింది. పిమ్మట ముఖ్య అతిథి ప్రసంగం.

'నేనడుగుతున్నా. సమాజంలో పూరిపాకల్లో మూల్గులు, ప్రమాదాల్లో మూల్గులు, ఆసుపత్రుల్లో మూల్గులు ఎన్నో వింటన్నాం. కానీ ఇట్లాంటి వెరీ స్పెషల్ మూలుగు ఎప్పుడైనా విన్నారా? ఇది బడుగు, బలహీనవర్గాల కోసం ఈ యొుక్క కవిగారు (పేరేంటన్నారు?) ఆ, వారు మూల్గిన మూలుగు. ఇది అన్ని వర్గాల్లోకీ పాకి, మన సమాజం ఆరోగ్యవంతం కావాలని గట్టిగా కోరుతున్నా. ఈ వామనుడు ముందు ముందు తివ్విక్రముడై విజృంభించాలని...'' అంటుండగా ఎవరో సవరించారు, 'త్రివిక్రముడు' అని.

''మాటదేముంది? ఐడియా ముఖ్యం. ఈ వామనుడు ముందు ముందు తివ్వి...సరే, అట్లా విజృంభించాలని, ప్రభుత్వం తరుపునా, యావన్మంది ప్రజానీకం తరుపునా విగ్నప్తి చేస్తున్నా.''

తక్కిన వక్తలు కూడా పద్ధతి చొప్పున కవిని ఆకాశానికెత్తేశారు. సీనియర్ కవి వామనమూర్తిని వర్తమాన/వర్ధమాన కవులకు దిక్సూచి అని కొనియాడాడు. తన ముందుమాటలో నాలుగు లైన్లు చదివాడు.

అప్పుడు నా చూపులు వింటున్నాయి
చుక్కల్లో పర్వత రెక్కల గుసగుసలు
దిక్కుల్లో చెక్కిన వాక్కుల గుమగుమలు
వెక్కిళ్లలో మనుషుల వ్యథలూ గాథలు

'చుక్కల్నీ, పర్వతాల్నీ ఎవరైనా చూస్తారు. కానీ ఎక్కిళ్లలో మనిషి పడే బాధ కవి మాత్రమే చూస్తాడు. రవి గాంచనిచో కవి గాంచునే కదా! ఇకనుంచీ ఈ వామనమూర్తి వామనమూర్తి కాదు,' అని ప్రేక్షకుల ఉత్కంఠ కోసం ఆగాడు. "అవును, వా-మనమూర్తి కాదు, కవిత్వం మూర్తీభవించిన 'మన మూర్తి.'"

గట్టి చప్పట్లతో సభ విజయవంతమైంది. అటు పైన సభానంతర సభ. ఖరీదైన హోటల్‌లో పానగోష్ఠి రసవంతంగా సాగే క్రమం. రెండో పెగ్గు కాగానే - చేతిలో గ్లాసు విసిరికొట్టాడు సీనియర్ కవి...

చదువరీ! ఇక ముందుకు సాగుము.

## మలి మెట్టు

ఉచిత పంపిణీ పథకం కింద కవి వామనమూర్తి తెలుగుదేశంలో సాహిత్య ప్రముఖులందరికీ పుస్తకాలు పంచాడు, మరియు పంపించాడు. ఆ ప్రకారంగా వెయ్యి పుస్తకాల్లో ఏడెనిమిది వందలు చెల్లినా పెద్దగా స్పందన రాలా. ఫలానా మేటి రచయితని కలిసి పుస్తకం అందిస్తే ఏదైనా అవార్డుకి సిఫార్స్ చేయొచ్చని ప్రత్యేకంగా వెళ్లి కలిశాడు. పుస్తకం తిరగేసిన ఆయన మొహంలో ప్రసన్నత మాయమైంది.

'కేవలం పొగిడితే వర్ధిష్ణువైన మీకేం లాభం లేదు. అక్షర మూలుగా? వైరి సమాసం కదా? పోనీ అనుకున్నా వినసొంపుగా లేదాయె. ప్చ్! ఇవాళ ఏది కవిత్వమో, అకవిత్వమో చెప్పేవాళ్లు లేరు, వినేవాళ్లూ లేరు. వచన కవిత్వం అంటే వచనం కాదు. నియమ నిబంధనలు లేకున్నా ఊహాబలంతో, లోతైన భావంతో, అంతర్లయతో వచన కవిత రాయటం మిక్కిలి కష్టం. ఇతరులు చెప్పని మర్మమేదో కళాత్మకంగా చెప్పాలి మనం. అంతకుమించి అందులో మన ఊపిరేదో ఉండాలి. దానికి మొదటి మెట్టు అధ్యయనం. రెండోది సాధన. సాధన చెయ్యండి. మిత్రమా! కవిత్వం దినచర్య కాదు, హృదయ చర్య.'

ఆ మాటలు మింగుడు పడలేదు వామన మూర్తికి.

"పోయి పోయి ఆయన్నెందుకు కలిశావోయ్? ఆయనదసలే 'కవి కుటుంబ నియంత్రణ' నినాదం," అని మందలించాడు మోహనరావు.

"నేను పైకొచ్చి ఆయనకి పోటీ అవుతానని అసూయ. ఆవిష్కరణలో అంతమంది పెద్దలు ఊరికే ప్రశంసిస్తారా ఏమిటి?" అన్నాడు వామనమూర్తి తల ఎగరేసి.

"కదా మరి! ఎంత పెద్ద పార్టీ ఇచ్చాం!" అన్నాడు మిత్రుడు.

రెట్టించిన పట్టుదలతో, దించిన కలం ఎత్త కుండా, దినచర్యగానే మరో 90 కవితలు రాసేశాడు వామనమూర్తి. రెండో కవితాసంపుటి వెలువడింది. పుస్తకం పేరు 'వాక్య వెలుగు'. మళ్లీ ఆవిష్కరణ సభ, సభానంతర గోష్ఠి యథావిధిగా విజయవంతం, రస వంతం అయ్యాయి. అట్లా ఆ యొక్క రచనా వ్యాసంగం అప్రతిహతంగా సాగిపోయింది. ఏడాది తిరక్కుండానే మూడో పుస్తకం పురుడు పోసుకుంది. ఈసారి దీర్ఘ కవిత. కోవిడ్-19 విజృంభణతో దేశమంతా కుంగి కూలారితే, దుర్ఘటనలకు ఎదురుచూసే (కవిత్వంకోసమే సుమా) వామనమూర్తి పంట పండింది. 'కరోనా! ఓ కరోనా! / ఈ కర కరాళ ఋతువులో / నేనుంటానా, పోతానా?' అనే వరసలో పొడుగాటి కవిత వెలువడి పేరు గడించింది.

## మూడో మెట్టు

ఇంత చేసినా సాహిత్యలోకం తనని సరిగ్గా గుర్తించి, అవార్డులతో గౌరవించటం లేదని ఒక కవి

సమ్మేళన సందర్భంలో మరో యువకవి దగ్గర వాపోయాడు వామనమూర్తి.

అతడన్నాడు చురుగ్గా, "నా ఉద్దేశం, రచన ద్వారా నా ప్రచారం కాకుండా, నా ద్వారా రచన ప్రచారం కావాలి. సిన్సియర్‌గా రాయటమే మన పని. కృషిని బట్టి గుర్తింపులో, గౌరవాలో వస్తే వస్తాయి, లేకుంటే లేదు. వాటికోసం వెంపర్లాడటం, ఎవరెవర్నో దేబిరించటం కన్న సాహిత్య దౌర్భాగ్యం లేదు."

లోలోపల ఉడికిపోయాడు వామనమూర్తి. దేశంలో దేనికైనా కొరత ఉందిగానీ అవార్డులకి కొరత లేదు గనక సంవత్సరీక సాహిత్య అవార్డులిచ్చే 'సరస సత్సాహిత్య సంస్థ' (స.స.స.) పోటీకి పుస్తకాలు పంపించాడు. తర్వాత సంస్థ సారథిని స్వయంగా కలిశాడు.


'నా అంత కవిని నేను కదా. ఈ యేడు ఆ అవార్డు నాకిచ్చి మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి కదా,' అని సూటిగా అడిగాడు.

"కానీ మాకు ముగ్గురు న్యాయనిర్ణేతలున్నారు కదా. కవిగా గతకీర్తి మీద బతకటం కుదరక ఒక సంస్థగా బతికుండాలనే సదాశయంతో ఇది పెట్టాను. బ్యాడ్ నేమ్ రాగూడదు,' అన్నాడు స.స.స. సారథి.

"ఇందులో మీ మాటే ఫైనల్ కదా. ఆ భారీ పారితోషికం అక్కర్లేదు కదా. (సభా ఖర్చు కూడా భరిస్తాను.) వట్టి కవర్ ఇవ్వండి, చాలు,' అన్నాడు వామనరావు.

స.స.స.సా. సాలోచనగా తల ఊపాడు. జడ్జీల్లో ఏ ఒక్కరూ వామనమూర్తి పుస్తకం సిఫార్సు చెయ్యలేదు. అయినా తక్కిన ఇద్దరు జడ్జీలు వామనరావు పుస్తకానికి ప్రథమ స్థానం ఇచ్చారని విడివిడిగా చెప్పి వాళ్లని ఒప్పించాడు స.స.స.సా. అట్లా ఉభయ తారకంగా 'ప్రతిష్ఠాత్మకమైన జాతీయ అవార్డు' దక్కింది కవికి.

'Wants are unlimited' అనే శాస్త్రవాక్యం విద్యార్థి దశలోనే జీర్ణించు కున్నాడు వామనమూర్తి. కవులన్నాక



శాలువాలూ, సన్మానాలూ, గౌరవాలూ మరెన్నో ఉండాలి కదా. 'ఎవరు న్నారు మనకీ లోకంలో/ సన్మానం చెయ్యటానికి / నా యశోభారం మొయ్య టానికి?' అని తలపోశాడు, కవితాత్మకంగా.

అదృశ్యవాణి ద్వారా ఆ తలపోత అందుకొన్న 'కళాకర్పూర' సంస్థ కార్యదర్శి తెల్లారేపాటికి రాజధాని నుంచి దిగాడు.

"బంగారం పళ్లేనికైనా గోడ చేర్పుండాలి. మీరు మేలిమి బంగారం, మేం చక్కని కుడ్యం (అనగా సుందర గోడ). తమలాంటి మహాకవుల కీర్తి దశదిశలా కర్పూరంలా గుభాళింపజేయటమే మా లక్ష్యం," అన్నాడు, అలవాటైన వాక్య విన్యాసంతో. (గుబాళింపుకు ఒత్తిస్తే గట్టిగా ఉంటుంది.) "ఔ, అదే మా ధ్యేయం," అన్నాడు పక్కనే వచ్చిన సత్రకాయ.

"మీ పద్ధతులేంటో చెప్పండి మరి."

"శాలువా, సన్మానపత్రం టైపు బొత్తిగా ఆర్డినరీ. ఏదో చెక్కముక్క, శాలువాతో సరిపెట్టి, అదే జాతీయ అవార్డు అనే లో-లెవల్ కాదు మాది. గజమాల, ఇద్దరు ముగ్గురు ప్రొఫెషనల్ ప్రసంగీకులతో నడిపించటం మా స్పెషల్. శాలువా, సన్మానపత్రం వగైరా మామూలే. ఇక వెరీ వెరీ స్పెషల్- తమలాంటి మహా గ్రేట్ కవుల కోసం, ఒకే ఒక్క లిమిటెడ్ టైమ్ ఆఫర్ ఉంది. 22 కారెట్ల స్వర్ణకంకణం (తమరు పరీక్షించుకోవచ్చు), పడవంత కార్లో ఊరేగింపు, నూటొక్క పూలమాలలు, ఇద్దరు మంత్రివర్యులతో జరిపించేది అన్నమాట. తెరిపి లేకుండా చప్పట్లు కొట్టగల దిట్టమైన నూట యాభైమంది ప్రేక్షకుల్ని కూడా (శ్రోతలు కాదు సుమా) సప్లయ్ చేసే పూచీ మాది. (తమరు లెక్కింపించుకో గలరు.) తక్కినవాళ్లను బతిమాలో, భంగపడో తెచ్చు కునే పని తమరిది. అన్నట్టు తమ శ్రీమతి కూడా వస్తారు గదా. ఇద్దరికీ కలిపి గజమాల వేస్తే నిండుగా ఉంటుంది. ఈ ప్రోగ్రాం అంతటికీ హైలైట్ ఒక బ్రహ్మాండ బిరుదు. (అదేమిటనేది సస్పెన్స్.) తమ లాంటి మహాకవులకి ఇదే సముచితమని 'కళా కర్పూర' మనస్ఫూర్తిగా భావిస్తుంది."

"ఔ, మనసారా సంభావిస్తుంది," వంత పాడాడు సత్రకాయ. "అన్నాయ్! వారు మహా గ్రేట్ కవులు గనక 20 పర్సెంట్ డిస్కౌంట్ కూడా ఇద్దాం."

'తథాస్తు.' అన్నాడు 'కళాకర్పూర' కార్యదర్శి. 'శుభం' అన్నాడు మోహనరావు. బేరసారాలు కుదిరాయి. అన్నిసార్లు మహాకవి అనిపించుకున్న వామనమూర్తి ఛాతీ విశాలమైంది.

'కళాకర్పూర' సంస్థకి దేశంలో చాలా నెట్‌వర్క్ ఉంది. ఒప్పందం ప్రకారం వామనమూర్తికి స్వర్ణ కంకణం, 'కవికుల తిలక' బిరుదు ప్రదానంతో, 199 మంది ప్రేక్షకుల సముఖంలో, మంత్రివర్యులు, ప్రముఖ కవుల ప్రశంసలతో 'న భూతో' సత్కారం జరిగింది. ఎందుచేతనో కవిగారి శ్రీమతి రాకపోవటం వల్ల జమిలి సన్మానం కుదరలేదు.

## నాలుగో మెట్టు

సాహిత్యం వెలుపలి విషయాల్లో ఆరితేరటం అందరికీ సాధ్యంకాదు. కవికుల తిలకుడు మరి నాలుగు పుస్తకాలు అచ్చేశాడు. ఆయా సంస్థల నుంచి తగు మాత్రం అవార్డులు సంపాదించాడు. ఒక అంతర్జాల పత్రికలో రెండు మూడు కవితలతో 'అంతర్జాతీయ కవి' అయ్యాడు. సుప్రసిద్ధ కవిగా వేరే వాళ్ల కవితాసంపుటులకీ పీఠికలు. తన రచనలు రెండు మూడు వేరే భాషల్లోకీ (ప్రతిఫల) అనువాదాలు. 'కవికుల తిలకా! / మీ కలం కనేది పలుకా / మేలిమి బంగారుతునకా' లాంటి అభినందన సుందర మందారాలతో ఒక విశేష సంకలనం. పనిలో పనిగా తన పేరిట ఒక అవార్డు స్థాపన. ఆ పైన కేంద్రస్థాయి అవార్డుల కోసం ఏం చెయ్యాలా అనే ప్రశస్తమైన ఆలోచనలో పడ్డాడు.

"నువ్వు కవికులానికే తిలకుడివి. కైలాస శిఖరానివి. ఏదో ఒకరోజు నిన్ను 'జాతీయ మహాకవి పురస్కార' రథంమీద- కొమ్మమీద కోకిలలా- కూర్చో బెట్టకపోతే ఈ యొక్క చెవి కోయిస్తా," అన్నాడు 'మై హూనా' మిత్రుడు భరోసాగా, పదిమంది కూడిన

రసవత్ గోష్ఠిలో. (అతని ఆర్థికావసరాలు ఎక్కువయ్యాయి.)

ఎవరి చెవో స్పష్టం చేయలేదు కనుక, 'What a poetic ambiguity!' అంటూ ఆశ్చర్యామోదం ప్రకటించాడు ఒక ప్రముఖ కవి. 'మహాకవి పురస్కారమా?' మూడో పెగ్గు ముగిస్తున్న మరో మిత్ర కవికి పొలమారింది. 'అది సవర్ణదీర్ఘ సంధిలెండి' అన్నాడు పక్కనే ఉన్న జర్నలిస్టు, చెయ్యి అడ్డు పెట్టి. (అతనికి కవిత్వ సువాసన లేదు.)

"ఆ రథం పోయి పోయి, ఆ యొక్క మేటి కవి ముంగిట్లో వాలుతుందేమో," అనుమానించాడు మరో మిత్రుడు.

'అమంగళం శాంతించుగాక!' అనుకున్నాడు వామనమూర్తి. సువర్ణ ద్రవపదార్థం గొంతు దిగేకొద్దీ, 'ఎవరి కంటే ఎవరు గొప్ప' అనే వాదోపవాదాలు మొదలై, అవార్డు ప్రదానాల అవకతవకలు, అస్మదీయ తస్మదీయ వర్గ ప్రాధాన్యాల మీదగా వాగ్యుద్ధం ప్రారంభమైంది. చూసి చూసి, జర్నలిస్ట్ ఇలా అందుకున్నాడు. (మార్మికంగా?)

"దేవునాన మున్ను దేశానకొకరుండ
ఇప్పుడూరనూర ఇంటనింట
ఏవురార్వురేడ్గురెనమండ్రు తొమ్మండ్రు
పదుగురైరి కవులు పద్మనాభ!

"అని వెనకటికెవడో వాపోయాడు. అయితే కాలం మారిపోయింది. ఇది కలికాలం కాదు, కవి కాలం. అసలు నా దృష్టిలో సమాజంలో ప్రతి ఒక్కడూ ఒక్కో కవి కావాలి. ప్రతి కవికీ ఒక పురస్కారం రావాలి. పూర్వం తపించి రచించేవాళ్లు. ఇప్పుడు రచించి తపిస్తున్నారు. అంతేగదా తేడా? భుజకీర్తి లేకుంటే కవి బూజు పట్టిపోడా? ఇక నాణ్యత సంగతంటారా? అది చూసుకోవటం పాఠకుల పని. సాహిత్యం ఎంత ముఖ్యమో సాహిత్యేతర విద్య కూడా అంతే ముఖ్యం. Yes. Apart from writing, as well today, persuading and lobbying are essential skills. ఆ విద్య ఒంటబట్టని అమాయక సత్కవులకు నా సంతాపం. ఏవో విలువలు పాటించేవాళ్లకే విలువ ఉంటుందని అమాయకులు అనుకోవచ్చుగాక. మన కార్యక్రమం మనది. కవిత్వం వర్ధిల్లాలి! వర్ధిల్లాలి కవిత్వం!"

ఏమైనా కవి వామనుడు, 'జాతీయ మహాకవి పురస్కార' రథం కోసం మునివాకిట్లో కళ్లు కాయలు గాచేలా ఎదురుచూస్తున్నాడు.

*ఆకాశవాణి, విజయవాడ సౌజన్యంతో*



సీరియల్



**యండమూరి వీరేంద్రనాథ్**

# వెన్నెల్లో ఆడపిల్ల





***తెలుగు నవలాసాహిత్యంలో పరిచయం అక్కర్లేని వ్యక్తి శ్రీ యండమూరి వీరేంద్రనాథ్. కొన్ని తరాల యువతని తన రచనాపటిమతో ఉర్రూతలూగించిన నవలా చక్రవర్తి. వీరి ఎన్నో నవలలు సినిమాలుగా వచ్చాయి. చాలా నవలలు పాతికకి పైగా రీప్రింటులయ్యాయి. నవల మొదలుపెడితే ఆఖరి పేజీ వరకూ పాఠకుల్ని లాక్కెళ్లే శైలి ఆయనది. దాదాపు ముప్పై ఏళ్ల క్రితం సీరియల్‌గా ప్రచురితమై తెలుగు పాఠకుల్ని కట్టిపడేసిన వీరి వెన్నెల్లో ఆడపిల్ల' నవల ఈ సంచిక నుండి సీరియల్‌గా ప్రచురిస్తున్నాము. చదివి ఆనందించండి.***

## నామన్‌గాన్. ఉజ్బేకిస్తాన్.

సమయం: సాయంత్రం అయిదున్నర.

విశాలమైన హాలు. మనుష్యులున్న అలికిడి లేదు కానీ, మెట్లలా ఉన్న విశాలమైన అర్చీల మీద కూర్చొని వందలాది జనం ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. అందులో చాలామంది రష్యన్లు, కొందరు భారతీయులు.

రెండు టెలివిజన్ కెమేరాలు నిశ్శబ్దంగా పని చేసుకుపోతున్నాయి. దూరంగా నిలబడి లెన్స్ సహాయంతో కొందరు ఫొటోలు తీసుకుంటున్నారు.

పోలన్‌స్కీ ముందుకు వంగి ఎదుటి బల్ల మీదకు తీక్షణంగా చూస్తున్నాడు. బల్ల మీద తెలుపు-గోధుమ రంగు చదరపు గళ్లు మనిషి జీవితపు గెలుపు ఓటమిల్లా పెనవేసుకుపోయి వున్నాయి.

తరువాత ఎత్తు వెయ్యవలసిన పోలన్‌స్కీ గెడ్డం గోక్కుంటూ ఆలోచిస్తున్నాడు. అతడి మినిష్టర్ శత్రువుల మధ్య అష్ట దిగ్భంధనంలో ఉంది.

హాలు మధ్యలో ఉన్న చదరంగపు బోర్డు మీద పావులు ఏయే స్థానాల్లో ఉన్నాయో ఎదురుగా ఉన్న ఎత్తయిన ఎలక్ట్రానిక్ బోర్డుమీద లైట్లు సూచిస్తున్నాయి. ఆ లైట్ల ఆధారంగా కొందరు ప్రేక్షకులు తమ ముందున్న బోర్డుల మీద అదే ఆటని ఆడుతూ నోట్సు వ్రాసుకుంటున్నారు.

ఇదంతా నిశ్శబ్దంగా... ఎవరి ఏకాగ్రతకూ భంగం కలిగించకుండా జరిగిపోతోంది.

పోలన్‌స్కీ తన 'మంత్రి'ని తీసుకొచ్చి ప్రత్యర్థి తాలూకు 'రాజు' ప్రక్కగా ఉంచి నవ్వేడు.

ఏషియన్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ పోటీలవి.

రష్యన్స్ చదరంగంలో ప్రవీణులు. చదరంగం ఆట మనిషి మెదడుని ఎంతో వికసితం చేస్తుందని గ్రహించి, ఆ ఆటని విద్యార్థులకి సబ్జెక్టుగా పెట్టిన వాళ్లు..! బాబీ పిషర్ లాంటివాళ్లు ఏ కొద్దిమందో తప్ప రష్యన్స్‌ని ఓడగొట్టి వరల్డ్ ఛాంపియన్‌షిప్ సంపాదించిన వాళ్లు ఎవరూలేరు. అందులోనూ పోలన్‌స్కీ...! గత పదేళ్లుగా మకుటం లేని మహారాజుగా వెలుగుతున్నాడు. ఈ చిన్న ఏషియన్ ఛాంపియన్షిప్ అతడికో లెక్కలోనిది కాదు.

తన మంత్రిని ప్రతిపక్షపు పావుల మధ్య నుంచి వెనక్కి తీసుకొచ్చి రక్షించుకోవటమే కాకుండా ఆ అడ్డు తొలగించి, బిషప్ ద్వారా 'చెక్' చెప్పటంలో పోలన్‌స్కీ తెలివితేటలు ప్రస్ఫుటమవుతున్నాయి.

ఉన్నట్టుండి భారత ఆటగాడి మీద వత్తిడి ఎక్కువయింది. అతడు ఏం చేస్తాడా అని రష్యన్ ప్రేక్షకులు అతడివైపు ఉత్సుకంగా చూస్తున్నారు. ముఖ్యంగా ఉన్ని కోట్లు కప్పుకున్న అమ్మాయిలు అవహేళన మిళితమైన ముసిముసి నవ్వులతో, అసలే చిన్నకళ్లని మరింత చిన్నవి చేసి చికిలించి చూస్తున్నారు.

గెల్చిన వాళ్లకి బహుమతి ఇవ్వటానికి చీఫ్-గెస్ట్ గా వచ్చిన భారత రాయబారి కూడా ఒకప్పుడు చదరంగం ఆటగాడు. ప్లేయర్స్ కన్నా ఆయనే ఎక్కువ ఎగ్జయిటింగ్‌గా ఉన్నాడు. తన దేశపు ఆటగాడు ఏ ఎత్తు వేస్తాడా అని ఊపిరి బిగబట్టి చూడసాగేడు.

కిటికీ బయట అద్దాల మీద తెల్లటి మంచు దూదిలా జాలువారుతోంది.

భారతదేశపు ఆటగాడు రేవంత్...!

అంత చలిలోనూ అతడి నుదిటి మీద చెమట పడుతోంది. గతంలో ఆడిన పోటీలూ, వేసిన ఎత్తులూ, చదివిన పుస్తకాలూ, వ్రాసుకున్న నోట్సులూ... అన్నీ

రీళ్లలా తిరగసాగేయి. క్రీడాకారుడిగా ఇది తనకి జీవన్మరణ సమస్య అని అతడికి తెలుసు. మెదడులో చేపల కదలికల మల్లె ఆలోచనలు.

వాచీ వైపు చూశాడు. టైము రన్-అవుట్ అవుతోంది.

ఎత్తుకీ ఎత్తుకీ మధ్య ఆటగాడు ఎక్కువ టైమ్ తీసుకోవటానికి వీల్లేదు. గంటకి పదహారు ఎత్తులు వెయ్యాలి. అదీగాక, మొదటి 2 గంటల్లో 40 ఎత్తులు వెయ్యాలి.

ఆటగాళ్ల మధ్య బల్లకి చెరో వైపునా రెండు స్టాప్-వాచీలు బిగించబడి ఉన్నాయి. ఎత్తు వెయ్యగానే తన వాచీ ఆపు చెయ్యాలి. వెంటనే రెండో వాచీ దానంతట అదే ప్రారంభం అవుతుంది. రెండో ఆటగాడు ఎత్తు వేసి ఆపు చేసేవరకూ అది తిరుగుతూనే ఉంటుంది. ఎత్తు వేశాక వాచీ ఆపు చేయటం మర్చిపోయి ఓడి పోయిన వాళ్లూ, 'గంట' లోపులో పదహారు ఎత్తులు వేయలేక ఓడినవాళ్లూ కోకొల్లలు.

రేవంత్ ఇప్పుడు అదే స్థితిలో ఉన్నాడు.

ఇంకో అయిదు నిముషాల్లో నాలుగెత్తులు ఎలా వెయ్యాలి. ఎలా... ఎలా?

వాచీ తిరిగి పోతోంది. రష్యన్ ఆటగాడి గెలుపు ఖాయం. జనం చప్పట్లు కొట్టటానికి సిద్ధంగా ఉన్నారు. ఓడిపోతున్న రేవంత్ ముఖకవళికల్ని పట్టుకోవటం కోసం కెమేరామెన్ మరింత ముందుకి వచ్చాడు.

పోలన్‌స్కీ రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలి పైకప్పు కేసి చూస్తూ కూర్చున్నాడు. '...ఇక నీ పని అయిపోయింది సుమా,' అన్న సైకిలాజికల్ ఫీల్ ప్రత్యర్థిలో కలిగించ టానికి అదొక ఎత్తు. రేవంత్‌కి ఉన్న అయిదు నిముషాల్లో అప్పుడే అర నిముషం గడిచిపోయింది.

అతడు చూపుడువేలితో తన శకటుని ముందుకు జరిపేడు.

పోలన్‌స్కీ వెంటనే నైట్‌ని ముందుకి తీసు కొచ్చాడు.

రేవంత్ బంటుని కదిపేడు.



జనం అప్పుడే అతడి చుట్టూ చేరిపోయారు. రేవంత్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. అమ్మాయిలు మీదపడి ఆటోగ్రాఫులు తీసుకుంటున్నారు. విలేకర్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఒకదాని మీద ఒకటి ఆగకుండా ఫ్లాషులు వెలుగుతున్నాయి. రకరకాల కోణాలకోసం టి.వి. కెమేరాలు హడావుడిగా తిరుగుతున్నాయి. భారత రాయబారి తన హోదా కూడా మరిచి, సాటి క్రీడాకారుడుగా రేవంత్‌ను గాలిలోకి ఎత్తడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

సాధించింది తక్కువ విజయమేమీ కాదు. ఓడించింది పోలన్‌స్కీని! పది సంవత్సరాలుగా మకుటంలేని రాజుగా వెలుగుతూన్న ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడిని! వరల్డ్ ఛాంపియన్ కార్పోవ్, స్వీడిష్ గ్రాండ్ మాస్టర్ అండర్సన్లు కూడా పోలన్‌స్కీతో ఆడటానికి వెనుకాడతారు. అటువంటివాడిని ఓ ఇరవై అయిదేళ్ల యువకుడు చివరి క్షణంలో చిత్తు చేసేడంటే, దాని వెనుక ఎన్నో సంవత్సరాల దీక్షా పట్టుదల ఉంటే తప్ప అది సాధ్యం కాదు. ఏదో చివర్లో హడావుడి చేసి గెలిచిన తాత్కాలికమైన గెలుపు కాదిది.

ఒకమ్మాయి రేవంత్ చేత చేతిమీద ఆటోగ్రాఫ్ తీసుకుంటూంది. ఓ పన్నెండేళ్ల కుర్రవాడు రేవంత్‌ని సంభ్రమంగా చూస్తున్నాడు. ఒక ముసలివాడు అతడి భుజం ఆప్యాయంగా తడుతున్నాడు. అందరితో కలిసి రేవంత్ గుంపుగా ఆ గదిలోంచి బైట బాల్కనీలోకి వచ్చేశాడు. అప్పుడే లైవ్ టి.వి. ద్వారా ఈవార్త పాకిపోయినట్టుంది. చాలామంది భారతీయులు, కొందరు రష్యన్స్ అక్కడికి చేరుకుంటున్నారు.

జనం చుట్టుముట్టడం వల్ల రేవంత్ మొహం చెమట పట్టింది. చూసుకుంటే జేబులో చేతి రుమాలు లేదు. ఆడుతున్నప్పుడు జారిపోయినట్టుంది. ఇంతలో బహుమతి తాలూకు అనౌన్స్‌మెంట్ వినిపించటంతో అందరి దృష్టి అటు మళ్లింది. జనం మధ్య ఖాళీ చేసుకుని, రుమాలు తీసుకోవటం కోసం మళ్లీ హాల్లోకి వెళ్లాడు.

అక్కడ దృశ్యం చూసి అతడు స్థబ్దుడయ్యాడు. నిర్మానుష్యంగా ఉన్న విశాలమైన హాలు మధ్యలో చదరంగం బల్ల దగ్గర పోలన్‌స్కీ ముందుకు వంగి, మొహం చేతుల్లోకి దాచుకొని ఒక్కడే ఒంటరిగా కూర్చొని తనలో తాను రోదిస్తున్నాడు.

రేవంత్ అచేతనంగా అతడిని చూస్తూ ఉండిపోయాడు.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఒక క్రీడాకారుడి మహాభినిష్క్రమణాన్ని... ఆ స్థానాన్ని ఆక్రమిస్తూన్న మరో క్రీడాకారుడు వ్యథతో గమనిస్తున్నాడు.

అతడికి జాక్ లండన్ 'స్టీక్' అన్న కథ జ్ఞాపకం వచ్చింది. తన 'హయాము' తీరిపోయిందనీ, తన స్థానం ఆక్రమించుకోవటానికి కొత్త తరం వచ్చేసిందనీ పోలన్‌స్కీకి తెలిసిపోయింది. మరో పది సంవత్సరాలు తను కూడా ఈ రాజ్యాన్ని ఏలతాడు. తరువాత తను రోదిస్తూ ఉంటే ఇంకో కుర్రవాడు తనని ఇదే సానుభూతితో గమనిస్తాడు.

రేవంత్ చప్పుడుకాకుండా అక్కణ్నుంచి తప్పుకుని బైటకు వచ్చేశాడు.

వస్తూ అనుకున్నాడు- 'విజయమా విజయమా. వస్తూ శిఖరాన్నెక్కిస్తావు. వెళ్తూ పాతాళానికి తోస్తావు. నీకిది న్యాయమా?'

## 2

"కంగ్రాచ్యులేషన్స్."

"థ్యాంక్యూ."

"హాయ్ రేవంత్, కంగ్రాట్స్."

"థాంక్స్."

"కంగ్రాట్స్ మిస్టర్ రేవంత్?"

"థ్యాంక్యూ సర్."

అభినందనలు తెలుపుతున్న వాళ్లకి అతడు మెట్లెక్కుతూ సమాధానం ఇస్తున్నాడు.

పెమన్స్‌లా ప్రాడక్ట్సులో రేవంత్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్. అతడి ఛాంబర్ నాలుగో అంతస్థులో ఉన్నది. అతడు తన ఛాంబర్‌లోకి వచ్చేసరికి

మానేజింగ్ డైరక్టర్ పిలుస్తున్నాడన్న కబురు వచ్చింది. వెళ్లాడు.

"కంగ్రాచ్యులేషన్స్. ప్రొద్దున్నే పేపర్లో చూశాను..." అన్నాడాయన. థాంక్స్ చెప్పాడు.

"నీ వల్ల కంపెనీకి కూడా మంచి అడ్వర్‌టైజ్ మెంట్ లభిస్తుందోయ్."

రేవంత్ మాట్లాడలేదు.

ఒక పెద్ద పోటీలో ఉద్యోగి సంపాదించిన విజయాన్ని కూడా వ్యాపారదృష్టితో చూడగల ఆయన దక్షతకి మనసులోనే జోహార్లు అర్పించాడు. ఈయనే గానీ వ్యాపారం మానేసి చదరంగం ఆడటం మొదలు పెట్టి ఉంటే ఎప్పుడో ప్రపంచ ఛాంపియన్ అయిపోయి ఉండేవాడు.

అక్కణ్నుంచి వచ్చేశాక జనరల్ మేనేజర్ దగ్గరికి వెళ్లాడు. ఆయన దగ్గర రేవంత్‌కి బాగా చనువు ఉంది. ఆయన ఎప్పుడూ హడావుడిగా ఉంటాడు. పని తప్ప ఇంకొకటి పట్టించుకోడు.

"రావోయ్ రా. ఎందులోనో ప్రైజ్ వచ్చిందని విన్నాను. ఎందులో... కారం బోర్డా?" ఫైల్‌లోంచి తలెత్తకుండా అడిగాడు.

"కాదండీ, చదరంగం."

"ఓ. వెరీగుడ్. నీ పేరు పేపర్లో పెద్ద అక్షరాలతో వేశారే. టీమ్ కెప్టెన్‌వా?"

"కాదండీ, చదరంగం ఇద్దరే ఆడతారు."

"ఓహో. అయితే ఎవరితో ఆడి గెల్చావు?"

"పోలన్‌స్కీ అని. వరల్డ్ ఛాంపియన్ సర్," రేవంత్ కంఠంలో కొంచెం గర్వం తొంగిచూసింది.

"అతడెందుకొచ్చాడిక్కడికి?"

"లేదు సర్, నేనే వెళ్లాను."

"ఎక్కడికి?"

"రష్యా."

"వ్యాట్? ఎప్పుడూ" నిజాయితీతో కూడిన ఆశ్చర్యంతో అడిగాదాయన.

"మీరే కద్సార్ నాకు క్రిందటి వారం శలవు ఇచ్చింది."

"అవునవును కదూ. ఇంతకీ రష్యా ఎందుకు వెళ్లావు?"

"చదరంగం టోర్నమెంట్‌కి సర్."

"టోర్నమెంట్సా. ఓ... అయితే మీ టీమ్ నెగ్గిందన్న మాట. గుడ్."

తన మీద తనకే జాలేసి రేవంత్ లేచి వచ్చేస్తోంటే ఆయన, "బయట చాలామంది ఉన్నట్టు హడావుడి ఏమిటి?" అని అడిగాడు.

"ఈ రోజు ఇంటర్వ్యూలు సర్," జ్ఞాపకం చేశాడు.

"అవును కదూ. ఆ విషయమే మర్చిపోయాను. అన్నట్టు ఈరోజు మరో మీటింగ్ ఉందే. ఎలా?" తనలో తానే అనుకుంటున్నట్టు గొణుక్కున్నాడు. రేవంత్ మాట్లాడకుండా బైటకి వచ్చేశాడు.

అతడు తన ఛాంబర్స్ కొచ్చేసరికి అక్కడే కూర్చుని ఉన్న జేమ్స్ అతడిని చూసి నవ్వాడు. అతడు ప్రొడక్ట్సు మార్కెటింగ్ మానేజర్. కంగ్రాట్స్ చెప్పుకునే దానికన్నా ఎక్కువ స్నేహం వాళ్లది.

జేమ్స్. అయిదడుగుల ఆరంగుళాల ఎత్తు మనిషి. ఎత్తుకు తగ్గ లావు. నల్లగా ఉన్నా మొహంలో కళ ఉంది. నిర్లక్ష్యమైన కళ్లు. పదో ఏట తల్లి లేచి పోవటంతో ఆ నిర్లక్ష్యం మొదలైంది. తాగుబోతు తండ్రి పట్టించుకోకపోవటంతో పెరిగింది. స్త్రీ అంటే అతనికి గౌరవం లేదు. అది అతడి తప్పుకాదు. మనసుని తాకినవాళ్లు లేరు. నిరాసక్తత కేరేపిన్ని చేసింది. నిర్లిప్తత నాజూకు భావాల్ని చంపింది. తాగితే రాత్రంతా తాగుతూనే ఉంటాడు. లేకపోతే ఓ నాలుగు నెలలు అస్సలు ముట్టుకోడు.

చాలామంది చెడ్డవాళ్లు మంచివాళ్లుగా కనిపించ టానికి ప్రయత్నం చేస్తే, ఇతడు పనిగట్టుకుని చెడ్డ వాడుగా కనిపించటానికి ప్రయత్నం చేస్తాడు. మనసు పొరల్లోకి తరచి చూస్తే అంతా మంచే. కానీ ఎవరి కుంది ఆ ఓపిక? ఆ విధంగా ఆడవాళ్లలో చాలా చెడ్డ పేరు సంపాదించాడు. దానికి ఉదాహరణగా, పెమెన్స్‌లాలో పనిచేసే ఎనిమిదిమంది అమ్మాయిల్లో ఏడుగురికి అతడంటే పడదు. ఇంకొక అమ్మాయి బాలవితంతువు.

ప్రపంచాన్నీ, జీవితాన్నీ ప్రేక్షకుడిగా చూడటం వల్ల అతడి నిర్లక్ష్యం నుంచి హాస్యం పుట్టింది. అప్పుడప్పుడూ వ్యంగ్యచిత్రాల రూపంలో అది బైట పడుతూ ఉంటుంది. కుదురుగా గీస్తే మంచి కార్టూనిస్టయి ఉండేవాడు. కుదురు లేదు. పత్రికల్లో అప్పుడప్పుడూ కార్టూన్లు పడుతూ ఉంటాయి.

రేవంత్ దీనికి పూర్తిగా వ్యతిరేకం. ఒక గొప్ప చిత్రకారుడు కుదురుగా కూర్చుని గీసిన చిత్రం అతడి జీవితం. చాలా సిస్టమాటిక్. అయిదింటికే లేచి అరగంట వ్యాయామం చేసి, అయిదు గంటలు చదరంగం ఆడి, ఆపై అరిస్టోక్రసీ కోటేసుకొని ఆఫీసు కొచ్చే ఆ అయిదడుగుల అయిదంగుళాల అబ్బాయి అంతరంగం ఆకాశంలా నిర్మలం, ఆకృతి అరవిందంలా కోమలం. పదవి కంఠంలో నమ్రతనీ, హోదా మనసులో బిడియాన్నీ పోగొట్టలేదు.

విభిన్న ధృవాలు ఆకర్షించబడినట్టు వాళ్లు స్నేహితులయ్యారు.

"ఎయిర్‌పోర్ట్‌కి వచ్చాను. నే వచ్చేసరికి విమానం రావడం, వెళ్లిపోవడం కూడా జరిగిందట," అన్నాడు జేమ్స్.

"చాలా శ్రమ తీసుకున్నావే," నవ్వాడు రేవంత్.

"జెండా ఎగరేసి వచ్చావ్ కదా."

రేవంత్ మొహం మ్లానమై, నవ్వు మాయమైంది. పేరుకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ అతడు నెమ్మదిగా విషాదంగా అన్నాడు. "...నేను సాధించింది తక్కువ విజయమేమీ కాదని నాకు తెలుసు. నేను అభిమానుల్నీ, పూల దండల్నీ ఘనస్వాగతాల్నీ కోరుకోలేదు కానీ ఎయిర్ పోర్టుకి ఒక్కరంటే ఒక్కరు కూడా రాలేదు. ఫార్మలిటీగా కనీసం ప్రాంతీయ క్రీడామండలి సెక్రటరీ కూడా రాలేదు."


"నువ్వు క్రికెట్ ఆటగాడివి కాకుండా చదరంగం ఆటగాడివి కావటం కారణమా?"

"కాదు. తెలుగువాడిని కావటం. నేను బాధ పడటంలో తప్పుందా? నీకు తెలియనిదేముంది. నువ్వూ అర్టిస్టువేగా. క్రీడాకారుడూ, కళాకారుడూ చిన్న పిల్లలాంటివారు. వారిపట్ల రవ్వంత ప్రోత్సాహం చూపిస్తే పొంగిపోతారు. అభిమానం కురిపిస్తే, 'మీ విజయాన్ని మేం గమనిస్తున్నాం,' అని చెప్తే రెట్టించిన ఉత్సాహంతో మరింత బాగా కృషి చేస్తారు. ఆ అభిమానమే కొరవడుతూంది ఈ రోజుల్లో..."

గుడి గంటలా ఫోన్ మ్రోగింది.

ఫోన్ ఎత్తి తన సహజమైన బిజినెస్ మోనో టోన్‌లో, "హలో," అన్నాడు రేవంత్.

అవతలివైపు నుంచి వెంటనే సమాధానం రాలేదు. అతడు విసుగ్గా మరోసారి, 'హలో,' అంటూండగా, "హ... హలో..." అంటూ కాస్త బెదురూ, కొద్ది ఎగ్జైయిట్‌మెంటూ, మరికొంచెం చిలిపితనం- అన్నీ మిళితమైన ఓ స్వరం అవతల్నుంచి వినపడింది. కుర్చీలో చప్పున కదిలి, "ఎవరూ?" అన్నాడు.



"నేను... నేను... మీ అభిమానినండీ. కంగ్రాచ్యులేషన్స్ చెబుదామని ఫోన్ చేశాను."

ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి అభినందనలు చెప్పటం అతడికి క్రొత్త. అందులోనూ అమ్మాయి చెప్పటం మరీ కొత్త.

"థ్యాంక్స్. మీ పేరు?"

"పేరెందుకు?" అందా అమ్మాయి.

రేవంత్ విస్మయంతో, "అదేమిటి? పేరు చెప్తే నష్టం ఏముంది?" అన్నాడు.

"లాభం మాత్రం ఏముంది? మీకు తెలియాల్సిందల్లా మీ విజయాన్ని గమనించిన ఒక అభిమాని మీకు అభినందనలు తెలుపుతున్నారని. అంతేకదా."

"కానీ చెప్పటంవల్ల నాకు కొద్దిగా సంతృప్తి వస్తుంది. మళ్లీ ఎప్పుడైనా గుర్తు తెచ్చుకుంటే, 'ఫలానా అమ్మాయి ఫోన్ చేసింది కదా,' అని ఊహించుకోవటానికి బావుంటుంది," సమర్థించుకుంటూ అన్నాడు రేవంత్.


రేవంత్ పడుతూన్న అవస్థ చూసి, "ఏమిటి విషయం," అని అడిగాడు జేమ్స్.

మౌత్‌పీస్‌కి చెయ్యి అడ్డుపెట్టి, "ఎవరో అమ్మాయి అభినందనలు చెబుతోంది," అని, మళ్లీ తిరిగి ఫోన్‌లో, "ఏం? నా ఆర్గ్యుమెంట్ కరక్టేనా!" అని ప్రశ్నించాడు.

"నా పేరూ..." అంటూ చెప్పబోయి ఆగి, "నా పేరు మొదటి అక్షరం 'ఆర్'. దీన్నిబట్టి కనుక్కోండి," అంది.

అతడు తెల్లబోయి, "ఎలా కనుక్కోవటం?" అని అడిగాడు.

"పెద్ద చదరంగం ప్లేయర్ కదా. ఆ మాత్రం కనుక్కోలేరా? ఆర్ అన్న అక్షరంతో ప్రారంభం అయ్యే తెలుగు అమ్మాయిల పేర్లు ఎన్నుంటాయేమిటి?" అని నవ్వి, "అరగంట తరువాత ఫోన్ చేస్తాను. ఈ లోపులో వీలైనన్ని నోట్ చేసుకుని ఉంచండి," అని ఫోన్ పెట్టేసింది.



రెండు నిముషాల తరువాత చూస్తే స్నేహితు లిద్దరూ కాగితం, కలాలతో కుస్తీ పడుతున్నారు.

రాధ- రాధిక- రమణి- అన్న మూడు పేర్లు తట్టినయ్. అప్పటికే ఐదు నిముషాలు గడిచాయి.

రేవంత్ తల విదిలిస్తూ, "ఉహూ. ఇదేమీ లాభం లేదు గురూ" అన్నాడు. పులి మీద పుట్ర అన్నట్టు ఇంతలో జనరల్ మేనేజర్ పిలుస్తున్నారని ప్యూన్ వచ్చి చెప్పాడు.

రేవంత్ జి.ఎం రూమ్‌కి వెళ్లేసరికి ఆయన పియ్యే మీద ఎగిరిపడుతున్నాడు. అయిదింటికి మీటింగ్ పెట్టుకుని నాలుగింటికి ఇంటర్వ్యూలు ఎలా ఏర్పాటు చేశావని తిడుతున్నాడు. రేవంత్ వెళ్లగానే, "చూడవోయ్, పదహారుమంది కాండేట్స్‌ని గంటలో ఇంటర్వ్యూ చెయ్యాలట. ఇదేమన్నా సాధ్యమా?" అన్నాడు.

రేవంత్ మాట్లాడలేదు.

మళ్లీ ఆయనే, "ఇదే లాభంలేదుగానీ రేవంత్, కమిటీ రూమ్‌లో కూర్చొని నలుగురిని సెలక్ట్ చెయ్యి. ఇదంతా అరగంటలో జరిగిపోవాలి. ఆ నలుగురిలో ఒకర్ని నేను ఫైనల్‌గా సెలెక్ట్ చేసుకుంటాను. క్విక్. మళ్లీ ఆ తరువాత నాకు ఇంకో మీటింగుంది," అంటూ ఫైలు చదవటంలో మునిగిపోయాడు.

రేవంత్ బైటికొచ్చాడు.

ఆయన గంటలో చెయ్యలేనిది తను అర గంటలో ఎలా చెయ్యగలడో అతనికి అర్థం కాలేదు. పోనీ గంటా తనకే ఇచ్చి ఒకర్ని సెలక్టు చెయ్య మనొచ్చుగా. ఊహూ. మళ్లీ ఫైనల్ అథారిటీ తన చేతిలోనే ఉంచుకోవాలి. అతనికి నవ్వొచ్చింది. బ్యూరో క్రసీకి పరాకాష్ట.

వరండాలో కుర్చీల్లోనూ, సోఫాల్లోనూ సర్దుకుని కూర్చుని ఉన్నారు కాండేట్లు. తాయిలం కోసం చూసే చిన్నపిల్లల్లా ఉన్నాయి వాళ్ల మొహాలు. ఎనిమిది మంది అబ్బాయిలూ, ఎనిమిది మంది అమ్మాయిలూ. అందరూ తెలివైనవాళ్లలాగే కనబడుతున్నారు.

వాళ్లను చూసేసరికి ఫ్లాష్‌లాంటి ఆలోచన తట్టింది రేవంత్‌కి. కమిటీ రూమ్‌లో కూర్చుని, వాళ్లని లోపలకి పంపమని సెక్రటరీతో చెప్పాడు.

"ఒక్కొక్కర్ని పంపమంటారా?" సెక్రటరీ అడిగాడు.

"కాదు. అందర్నీ పంపు."

సెక్రటరీ అతడివైపు విచిత్రంగా చూశాడు. అతడి అనుమానం గ్రహించి, "ఒక్కొక్కర్ని ఇంటర్వ్యూ చేయాలంటే అరగంటలో సాధ్యంకాదు. మాస్ ఇంటర్వ్యూ చేద్దాం," అన్నాడు రేవంత్.

సెక్రటరీ బయటికి వెళ్లిన నిముషానికి బిలబిల మంటూ అభ్యర్థులు లోపలికి వచ్చారు.

"కూర్చోండి," అన్నాడు రేవంత్.

బోర్డు రూము మధ్యలో ఉన్న బల్ల చుట్టూ కుర్చీల్లో కూర్చున్నారు వాళ్లంతా.

రేవంత్ నిలబడి కంఠం సర్దుకొని, రాజకీయ ఉపన్యాసంలా చెప్పటం ప్రారంభించాడు: "ఇటీవలి కాలంలో అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవటం కోసం రకరకాల సైంటిఫిక్ పద్ధతులు వచ్చాయి. పూర్వంలా చరిత్ర, భూగోళంలో ప్రశ్నలు అడగటం లేదు. తెలివి తేటల్ని పరీక్షించటానికి ఓ కొత్త పద్ధతి ఇంటలిజెన్స్ కోషియెన్సీ. అంటే ఐ.క్యూ. టెస్ట్. ఆ పరీక్ష ద్వారా మీలో నలుగుర్ని ఎన్నుకుని ఫైనల్ ఇంటర్వ్యూకి మా జనరల్ మేనేజర్ దగ్గరికి పంపుతాను." ఊపిరి తీసుకోవటానికి ఆగి, తిరిగి చెప్పటం ప్రారంభించాడు. "ఐ.క్యూ. టెస్ట్‌లో లెక్కలు, కరెంట్ అఫైర్స్ వగైరా ఏదయినా అడగవచ్చు. కానీ పెమన్స్‌లా ప్రొడక్ట్సు తెలుగువారికి ప్రియమైనవి. ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకి. అందుకని మీకో పరీక్ష పెడుతున్నాను. 'ఆర్' తో ప్రారంభం అయ్యే తెలుగు అమ్మాయిల పేర్లు వ్రాయండి. పదిహేను నిముషాల్లో ఎక్కువ పేర్లు వ్రాసిన నలుగురు ఫైనల్ ఇంటర్వ్యూకి వెళ్తారు."

అతడి మాటలు పూర్తి కాకముందే 'కౌన్ బనేగా కరోర్‌పతి'లోలా అప్పుడే ఇద్దరు ముగ్గురు వ్రాసెయ్యటం మొదలుపెట్టారు. కొంతమందికి

వెంటనే అర్థంకాలేదు. నిముషం తరువాత ట్యూబ్‌లైట్ వెలిగి, కలాలు కాగితాల మీద పెట్టారు.

అయిదు నిముషాలు తలెత్తకుండా వ్రాశాక పైకప్పుకేసి చూసేవాళ్లూ, గోళ్లు కొరుక్కుంటూ ఆలోచించేవాళ్లూ, ఓరగా పక్కవారి కాగితాల్లోకి చూసే వాళ్లూ తయారయ్యారు. చాలామంది పది, పదకొండు కన్నా ఎక్కువ వ్రాయలేదు. కొంతమంది క్రిష్టియన్, ముస్లిమ్ పేర్లు కూడా వ్రాసేరు. ఒకమ్మాయి మాత్రం ఎక్కువ వ్రాసింది.

ఎక్కువ పేర్లు వ్రాసిన నలుగుర్ని సెలక్టుచేసి జనరల్ మేనేజర్ దగ్గరికి పంపి, ఆ కాగితాలు పట్టుకుని రేవంత్ తన ఛాంబర్‌కి వచ్చేశాడు.

ఆ అమ్మాయి దగ్గర్నుంచి ఫోన్ రావటానికి ఇంకా పది నిముషాలుంది.

"ఇంత ఆలస్యం అయిందే," జేమ్స్ అడిగాడు. తను చేసిన పని చెప్పాడు రేవంత్.

జేమ్స్ అదిరిపోయి, "నిజంగా నీది చదరంగం బుర్రే బాసూ," అంటూ అభినందించాడు.

రేవంత్ నవ్వి తన చేతిలో ఉన్న కాగితాల వంక చూస్తూ, "అన్నీ అలా కలిసివచ్చాయి," అన్నాడు.


ఇద్దరూ కలిసి కామన్ పేర్లు తీసేసి, ఫైనల్ లిస్టు తయారుచేసేసరికి మరో పదినిముషాలు పట్టింది. ఆ పై మరో అయిదు నిముషాలకి ఫోన్ మోగింది. దాని కోసమే చూస్తున్నట్టు రేవంత్ చప్పున రిసీవర్ అందు కున్నాడు.

"కనుక్కున్నారా?" అట్నుంచి చిన్న నవ్వుతో అమ్మాయి స్వరం.

"ఆఁ. చాలా పేర్లున్నాయ్."

"చెప్పండి. అందులో నా పేరుంటే ఈ రోజే మీ ఆఫీసుకొచ్చి స్వయంగా అభినందిస్తాను. చదరంగంలో గెల్చినందుకు కాదు. నేను పెట్టిన పోటీలో గెల్చి నందుకు."

రేవంత్ మొహం ఉక్రోషంతో ఎర్రబడింది. "అంత కష్టమేమీ కాదనుకుంటాను. అయితే ఒక షరతు. మీ పూర్తి పేరు నేను చెప్పలేకపోవచ్చు. ఉదా హరణకి మీ పేరు 'రమణీ ప్రియ' అనుకోండి. నేను రమణి అని చెప్పినా, ప్రియా అని చెప్పిన అది కరెక్టే," అన్నాడు.



"ఓ.కే."

పేర్లు ఫైనలైజ్ చేసిన కాగితం తీసుకుని చదవటం మొదలు పెట్టాడు రేవంత్. "రాధ."

"కాదు."

"రజని."

"కాదు."

జేమ్స్ ఊపిరి బిగపట్టాడు.

"రాజ్యలక్ష్మి... రోజా."

అట్నుంచి నవ్వు. "రెండోది తెలుగు పేరు కాదు. నాది చాలా అందమైన, అచ్చమైన తెలుగు పేరు. ఏ బాపూనో, విశ్వనాథో వింటే చటుక్కున సినిమాకు పెట్టుకునే పేరు."

కసిగా, "రంగమ్మ, రౌడీ రంగమ్మ," అన్నాడు.

అట్నుంచి ఉక్కిరి బిక్కిరి అయ్యేటంత నవ్వు. "...కాదు."

"రామేశ్వరి, రమాలక్ష్మి, రాగిణి, రతి, రమాప్రభ, రాజసులోచన, రత్నప్రభ, రత్నకుమారి, రంగమణి, రమామణి, రత్నపాప, రోహిత, రమాతిలకం, రాగ చంద్రిక, రోహిణి, రాణి, రంగ, రంగవల్లి, రామసీత, రుచిర, రాగమణి, రామభద్ర, రాజనర్తకి, రీతిగౌళ, రచన, రూప, రూపి, రాజిత, రుక్క, రుక్మిణి, రంజిత, రంజన, రాధిక, రూమా, రమోలా, రసిక, రేణు, రేణుక, రేవతి, రుద్ర, రేష్మి, రాగమయి, రాగవల్లి, రంభ, రూనా, రీమా, రసిత, రఘునందిని, రాగరాగిణి, రీతూ, రౌద్రి, రాజశ్రీ, రసమయి, రేరాణి, రుతు, రాజీవలోచన, రత్నావళి, రజనీగంధ, రసన, రమల, రవిచంద్రిక, రసమంజరి, రక్తి, రక్తోత్పల, రవళి, రహి... ..."

"ఊహూ - ఇవేమీ కావు."

వళ్లు మండింది. "...రావులమ్మ, రామాయమ్మ, రత్నమ్మ, రత్తాలు, రుద్రమ్మ, రాయమ్మ, రంగాయమ్మ, రాంభద్రమ్మ వైఫ్ ఆఫ్ రాంభద్రయ్య?"

అట్నుంచి సింపుల్‌గా, "కాదు," అని వినిపించింది.

"సినిమా యాక్టర్లు రాఖీ, రేఖా."

"ఊహూ."+

"ఆయుర్వేద మందులు- రత్నావళి, రాజరత్న, రాజీవ."

"హోమియోపతి ట్రై చెయ్యండి."

అతను పెదాలు బిగించి, "రస్న - రైనా - రస్మోసాంగ్," అన్నాడు.

ప్రక్కనించి జేమ్స్, "రసికప్రియ," అని అందించాడు.

"ఆఁ రసికప్రియ - రమణి - రతి."

ఫోన్ కట్టయింది. రేవంత్ హతాశుడై, "ఆ అమ్మాయికి కోపం వచ్చినట్టుంది గురూ. అయినా రాకేం చేస్తుంది? ఏదో అభినందించటం కోసం ఫోన్ చేస్తే 'రతి, రాత్రి, రహస్య' అన్న పేర్లు చెబితే," అన్నాడు.

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. "మే ఐ కమిన్ సర్."

"యస్ ప్లీజ్."

ఇంటర్వ్యూలో అందరికన్నా ఎక్కువ పేర్లు వ్రాసిన అమ్మాయి లోపలికి వచ్చింది. ఆమె మొహం ఆనందంతో వెలిగిపోతోంది. "నేను సెలెక్టయ్యాను సార్!" అంది.

"అన్ని పేర్లు వ్రాసినప్పుడే మీరు సెలక్టవుతారని అనిపించింది. కంగ్రాట్స్. గొప్ప ఐ.క్యూ మీది," మెచ్చుకున్నాడు.

జేమ్స్ అందుకుని, "పావుగంటలో పదిహేను అభ్యర్థుల్లో సెలక్టు చేసుకోవటానికి మావాడు కనుక్కున్న గొప్ప పరీక్ష ఇది," అని రేవంత్‌ని పొగిడాడు.

ఆ అమ్మాయి మాత్రం భక్తిగా, "అంతా మా నాన్నగారి చలవ," అంది.

"ఆయనేం చేస్తూ ఉంటారు?" రేవంత్ అడిగాడు.

"జన్మదిన నక్షత్రాన్ని బట్టి నామకరణం చేసే పురోహితుడు."

స్నేహితులిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. రేవంత్ సర్దుకొని, "ఐ.క్యూ దేముందిలెండి. ఇంతకీ మీ పేరు?" అని ప్రశ్నించాడు.

"రామచిలుక. నా జన్మ నక్షత్రానికి ఆ పేరొక్కటే సరిపోయిందట. ఆ లిస్టులో నాపేరు వ్రాయటం మర్చిపోయాను."

*ఇంకా ఉంది*

జ్ఞాపకాలు

✻ ఎ. జగన్నాథశర్మ



# చలనచిత్రం

కిటికీ అవతల వర్షం. ఇవతల నేను రెండురోజులుగా జ్వరం. గదిలోనే ఉంటున్నాను. ఇవాళ పర్వాలేదు. నెమ్మదించింది. సాయంత్రం అయిదయింది. కాఫీ తాగుతున్నాను. కాఫీ తాగుతూ కిటికీలో నుంచి చూస్తుంటే... ముందుగా ఓ చినుకు పడింది. ఎక్కడ పడిందది? ఎదురుగా బాదంచెట్టు ఉంది. దాని ఆకుమీద పడింది. బాదం ఆకు మెడలొంచింది. తర్వాత మరో చినుకు. ఆపై ఇంకొక చినుకు... అలా సన్నసన్నగా చినుకులు మొదలయ్యాయి. బాదం ఆకులన్నిటినీ మొట్టాయి. మొత్తానికి వర్షం అయిందది.

నాకు వర్షంజోరు, సముద్రపుహోరు, గాలితీరు అంటే మహా ఇష్టం. ఇంద్రధనుస్సు కావాలనుకుంటే వర్షాన్ని ప్రేమించాలి. వర్షాన్ని ప్రేమించావూ అంటే... బురదను కూడా ప్రేమించాలి, తప్పదు.



*రచయిత, సంపాదకులు అయల సోమయాజుల జగన్నాథ శర్మ స్వస్థలం విజయనగరం జిల్లా, పార్వతీపురం. 500 పైగా కథలు, 18 నవలలు, అనేక వ్యాసాలు రచించారు. సినిమా, టీవీ రచయితగా కూడా ప్రసిద్ధులు. రామాయణం, భారతం, భాగవతం, హరివంశము తేటతెలుగులో ఆబాల గోపాలనికి అనువైన శైలిలో రచించారు. ఆంధ్రజ్యోతి వారి నవ్య వీక్లీ సంపాదకులుగా పనిచేసారు. నివాసం హైదరాబాదు.*

గాలీ, వర్షం పుంజుకున్నాయేమో! ముఖమ్మీద ఒలిపిరి కొట్టింది. ఖాళీ కాఫీగ్లాసును పక్కనపెట్టి, ముఖమ్మీది తడిని తుడుచుకున్నాను.

16 ఎంఎం స్క్రీన్ లా ఉంది కిటికీ. దానిమీద అనేక దృశ్యాలు కదలాడుతున్నాయి.

బాదంచెట్టుకి ఆవును కట్టి ఉంచారెవరో. వర్షానికి అది జలదరిస్తున్నది. దాని జలదరింపును చూసి, నేనూ జలదరించాను. నవ్వుకున్నాను. నలుగు రైదుగురు పిల్లలు, వర్షంలో నిండుగా తడుస్తూ గెంతు తున్నారు. ఒకరినొకరు నెట్టుకుంటూ, కౌగలించు కుంటూ, ఆకాశంకేసి చూస్తూ... వర్షాన్ని రా రమ్మని పిలుస్తున్నారు. తడిసిన చొక్కాలను తొలగించారు. అలాగే తడిసిన నిక్కర్లు కూడా తొలగించబోతూ నన్ను చూసి, నవ్వి, ఆ ప్రయత్నాన్ని విరమించారు. అడ్డుగా నిలిచిన పిల్లల్ని తొలగమన్నట్టుగా రిక్షావాలా బెల్ మోగించాడు. వర్షంలో పూర్తిగా తడిసిపోయాడతను. అయితే అతని తల తడవలేదు. తాటాకుటోపీ పెట్టుకుని ఉన్నాడతను. మలుపు తీసుకుని, ఎదురింటి ముంగిట రిక్షాని నిలిపాడు. అందులోంచి ముందు ఈశ్వరి తమ్ముడు దిగాడు. తర్వాత ఈశ్వరీ వాళ్లమ్మ దిగింది. ఆ తర్వాత ఈశ్వరి దిగింది.

ఈశ్వరి అప్పుడు ఎలా ఉంది? పట్టులంగా, బుట్ట జాకెట్టు, ఓణీలో ఇంద్రధనుస్సులా ఉంది. వర్షంలో ఉదయించిన లేలేత సూర్యుడిలా ఉంది. వేసవిలో వీచిన చలచల్లని గాలిలా ఉంది. చినుకులా ఉంది. మంచుపణుకులా ఉంది. ఈశ్వరికి పదహారేళ్లు ఉంటాయి. నాకు పదిహేడేళ్లు. నేను ఇంటర్ సెకండియర్ చదువుతున్నాను. తానేమో ఫస్ట్ ఇయర్ చదువుతోంది. కనిపిస్తే నవ్వుతుంది. కనిపించేంత వరకూ చూస్తూనే ఉంటుంది. నేనంతా గమనిస్తూనే ఉంటాను.

ఈశ్వరీ వాళ్లమ్మా, తమ్ముడూ ఇంటిలోనికి వెళ్లిపోయారు. ఈశ్వరి వెళ్లలేదు. గుమ్మంలో నిల్చుని ఉండి, కురుస్తున్న వర్షాన్నీ, కిటికీలో నుంచి కనిపిస్తున్న నన్నూ చూస్తూ ఉన్నది. చూరులోంచి తీగలుగా జారుతున్న వర్షాన్ని చేతుల్తో పట్టి ఆడుతూ నవ్వుతున్నది. నా నవ్వును ఆశిస్తూన్నది. నేను నవ్వాను. చాలనుకున్నది. టాటా చెప్పి, లోనికి వెళ్లి పోయింది. రిక్షావాడు వెను తిరిగి, మలుపు తీసుకుని, కిటికీ దగ్గరగా వచ్చాడు. కిటికీలో ఉన్న నన్ను చూసి, నవ్వి వెళ్లిపోయాడు. ఆడుకునే పిల్లలు కూడా లేరిప్పుడు. వీధి వీధంతా ఖాళీగా ఉంది. ఆ ఖాళీ నంతటినీ వర్షం నిండుగా నింపుతున్నది.

అమ్మ ఒడిలో తలపెట్టుకుని పడుకోవడం ఓ ఆనందం. నాన్న చేయి పట్టుకుని నడవడం ఓ ఆనందం. ఈశ్వరిని కౌగిలించుకోవడం ఓ ఆనందం. అలాగే వర్షంలో తడుస్తూ నడవడం ఓ ఆనందం. నాకిప్పుడు వర్షంలో నడవాలని ఉంది. అయితే అమ్మ ఒప్పుకోదు. జ్వరంకదా! తిట్టిపోస్తుంది.

"ఏరా! వేడివేడిగా పకోడి వెయ్యనా? తింటావా?" అడిగింది అమ్మ.

"ఎందుకు తినను?" ఎదురు ప్రశ్నించాను.

"నోరు బాగుందా?"

"ఎందుకు బాగాలేదు? వర్షంలో ఈశ్వరినవ్వులా ఉంది," అన్నాను. 'వర్షంలో ఈశ్వరి నవ్వులా ఉంది.' అన్న మాటను అమ్మకి వినిపించనట్టుగా గొణిగాను. ఆసరికే అమ్మ అక్కణ్ణుంచి వెళ్లిపోయింది.

ఎగిరొచ్చి రెండు కాకులు బాదంచెట్టు మీద వాలాయి. ఆసరికే బాగా తడిసిపోయాయవి. ముక్కుతో పక్కలను పొడుచుకుంటూ అటూ ఇటూ చూస్తున్నాయి. బాతులగుంపును తోలుకుని వెళుతున్నాడు ఓ కుర్రాడు. అవి 'బెబ్బెబ్బె'మని శబ్దిస్తూ వయ్యారాలు పోతున్నాయి.

"నానేటన్నాను, ఓ అని వానపడుతోందిగదా, పిల్లలకి ఏడేడిగా నాలుగు ఏరుసెనక్కాయలు ఏసి ఎట్టమన్నాను. నాను బెల్లం తీసుకొస్తాను, పిల్లలు తింటారన్నాను. ఆ మాటకే మీదపడిపోతోంది కోడలు. ఈ వొర్యంలో నేనేటి ఏసను, నువ్వెక్కడికీ ఎళ్లొద్దం టుంది. నేనింటానేటి?"

తనలో తాను మాట్లాడుకుంటూ గుడిసెలోని పార్వతమ్మ వర్షంలో తడుస్తూ వెళ్లిపోతోంది. వర్షాన్ని చూస్తూ, "పడుతల్లీ పడు! కరువు తీరి పోవాల," అని, పుడిసెడులోనికి వానచినుకులు పట్టి, తీర్థంలా నోటిలో పోసుకుంది.

వేడివేడి పకోడీలు అమ్మ తెచ్చిచ్చింది. ఉల్లిపకోడీ తింటుంటే రుచిగా బాగున్నాయి. చీకటిపడింది. వీధిలో మున్సిపల్ దీపాలు వెలిగాయి. ఆ వెలుగులో వానచినుకులు బంగారుతీగల్లాగ మెరుస్తూ కురుస్తున్నాయి.

"వొద్దు వొద్దంటే వినవుకదా! ఈ వొయసులో బురదలో కాలు జారితే ఏటవుతావు?" పార్వతమ్మకు ఎదురొచ్చి, ఆమెను గొడుగులోకి తీసుకున్నది కోడలు.

"ఎక్కడికెళ్లా?"

"సెప్పానుకదా, బెల్లం తెస్తానని. సెట్టికొట్టు కెళ్లాను," అన్నది పార్వతమ్మ.


"ఏరుసెనక్కాయలు ఏసేవా?" అడిగింది.

"ఏసేను. పదపద," అత్తగారిని దగ్గరగా తీసుకుని నడిచింది కోడలు.

ఇంతలో అమ్మ అరుపు వినవచ్చింది.

"ఒరేయ్! దోమలు వస్తాయి. కిటికీ మూసేయ్."

తప్పదు. కిటికీ మూసేసాను. సినిమా అయిపోయిందనిపించింది. స్వర్గంలోంచి జారిపడే ముద్దులు చినుకులు. తల్లి భూదేవిని నిలువునా చుంబి స్తున్నాయి. ఆ శబ్దాలు వినవస్తున్నాయి. సినిమా అయిపోతేనేం? సంగీతం రాత్రంతా వినవస్తుంది అనుకున్నాను.



## ఒకే ఒక్కడు

# చంద్రమోహన్



***60/70లలో కెరీర్ ప్రారంభించిన ప్రతీ నటుడికి ఏదోక దశలో అప్పుడప్పుడూ గ్యాప్ వస్తూండేది. ఫ్లాపులు పడో లేక ట్రెండ్ మారో... ఔట్ డేటెడ్ అయ్యో లేక ప్రేక్షకులకి బోర్ కొట్టేసో ఎక్కడొకచోట బ్రేక్ పడేది. కానీ చంద్రమోహన్ ఆ గ్యాపులకి, బ్రేకులకి అతీతుడు. వయోభారం వల్ల తనకి తాను తగ్గించుకుంటే తప్ప ఆఖరివరకూ ఆయనకి అవకాశాలకి కొదవలేదు! మార్కెట్ మార్పులకు తగ్గట్టుగా ధోరణిని మలచుకుంటూ, వివాదాలకి అతీతంగా మెలగుతూ... అలుపెరగకుండా యాభై ఏళ్ల పైబడి పరిగెత్తడ మన్నది ఓ కళ. అది అందరికీ చేతకాదు.***

***అందులో చంద్రమోహనుడు త్రివిక్రముడు!!***


***70-80 దశకాల సినిమాలు విరివిగా వేసే యే ఈటీవీనో, లేక మరో ఛానెలో సరదాగా ఓసారి పెట్టండి. ఎక్కడోచోట చంద్రమోహన్ కనబడకపోడు. 70ల కాలంలో కొత్త హీరోయిన్లతో ఆడిపాడే లక్కీమస్కట్‌గా కనిపిస్తాడు.***

***80ల టైర్-1 బ్యాచ్ కృష్ణ-శోభన్‌లు ముందడుగు లాంటి మల్టీస్టారర్లు చేస్తే వాళ్ల మధ్య ఓ క్యారెక్టర్ ఆర్టిస్టుగా దూరిపోయి మెరిపిస్తాడు. మురళీమోహన్‌లాంటి టైర్-2 బ్యాచ్ చిన్నచిన్న మల్టీస్టారర్లు చేసుకుంటే అందులో రెండో హీరోగా భుజం కాస్తాడు. సీనియర్లతోనే కాబోలనుకుంటే, లేదూ లేత రాజేంద్రుడితో సైతం జతకట్టి బోలెడన్ని బడ్జెట్ సినిమాలతో నవ్విస్తాడు.***

***90ల్లో ప్రేక్షకుల అభిరుచి మారినప్పుడు ఎంతోమంది పాతనటులు ఆ ఒరవడిని అందుకోలేక అక్కడే ఆగిపోయారు. కానీ చంద్రమోహన్ మాత్రం ట్రెండ్ కంటే ముందే పరిగెత్తి పరిశ్రమని కూడా అక్కడికి లాక్కెళ్లాడు. రాబోయే మార్పుల్ని త్వరగా పసిగట్టింది, భేషజాలకి పోకుండా అవకాశాల్ని ఒడిసి పట్టుకుంది ఈయనేనేమో!!***

చంద్రమోహన్‌గా పాపులర్ అయిన మల్లంపల్లి చంద్రశేఖరరావు తెలుగు సినిమా స్వర్ణయుగపు మేలి గురుతు! ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 900లకు పైగా చిత్రాలతో దక్షిణాది ప్రేక్షకులను అలరించారు. ఒకప్పుడు హీరోగా, తర్వాత కమెడియన్‌గా, ఈ తరానికి తండ్రిగా, అన్నగా, అంకుల్‌గా ఎన్నో వైవిధ్య పాత్రలతో మెప్పించారు. హీరోగా సుమారు 175 సినిమాలకు పైగా చేశారు. సహజసిద్ధమైన నటన ప్రదర్శించడం చంద్రమోహన్ శైలి.

కృష్ణాజిల్లాలోని పమిడిముక్కల గ్రామంలో మే 23 1943న జన్మించిన ఆయన రంగులరాట్నం చిత్రంతో తెలుగు చిత్రపరిశ్రమలో అడుగుపెట్టారు. గోపీచంద్ హీరోగా తెరకెక్కిన ఆక్సిజన్ ఆయన చివరి చిత్రం. తమిళ సినిమాల్లోనూ నటించారు. ఫిలింఫేర్, నంది అవార్డులు అందుకున్నారు. 1987లో చందమామ రావే సినిమాకు ఉత్తమ హాస్యనటుడిగా, 2005లో అతనొక్కడే సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా రెండు నంది పురస్కారాలు దక్కాయి. పదహారేళ్ల వయసు, సిరిసిరిమువ్వ సినిమాల్లో నటనకు ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డులు దక్కాయి.



కృష్ణ, రామ్మోహన్‌రావు హీరోలుగా ఆదుర్తి సుబ్బారావు రూపొందించిన *తేనె మనసులు* చిత్రం చూశాక చంద్రమోహన్‌కు సినిమాల్లో నటించాలన్న ఆసక్తి కలిగింది. దాంతో వెంటనే ఉద్యోగానికి సెలవు పెట్టేసి మద్రాస్ వెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆ సమయంలోనే దర్శకుడు బి.ఎన్.రెడ్డి రూపొందించిన *రంగులరాట్నం* చిత్రంలో నటించే అవకాశం దక్కింది. చంద్రమోహన్ ఆ సినిమాలో హీరోగా నటించారు. ఆ చిత్రంతో నటుడిగా చంద్రమోహన్‌కు మంచి గుర్తింపు వచ్చింది. కానీ వేషాలు మాత్రం రాలేదు. దానికితోడు... "నిన్ను హీరోగా పరిచయం చేశాను. తొందరపడి హీరో వేషాలు కాకుండా చిన్న చిన్న వేషాలు ఒప్పుకోవద్దు," అని బి.ఎన్. రెడ్డి చెప్పడం వల్ల చంద్రమోహన్ ధైర్యంగా ముందడుగు వెయ్యలేకపోయారు. ఆ సమయంలోనే బాపు దర్శకత్వంలో *బంగారు పిచుక* సినిమాలో హీరోగా అవకాశం వచ్చింది. కానీ ఆ సినిమా కూడా హిట్ కాకపోవడంతో ఆయనలో ఊగిసలాట మొదలైంది.

'ఇప్పుడేమి చేయాలి? మద్రాసులోనే మరికొంత కాలం ఉండిపోయి సినిమా అవకాశాల కోసం ఎదురు చూడడమా, లేక ఏలూరు తిరిగి వెళ్లిపోయి, మళ్లీ ఉద్యోగం వెతుక్కోవడమా,' అనే సందిగ్ధంలో పడ్డారు. ఆ సమయంలోనే కొందరు నిర్మాతలు చంద్రమోహన్‌కు తమ చిత్రాల్లో హీరో తమ్ముడిగానో, స్నేహితుడిగానో అవకాశాలు ఇస్తామన్నారు. బి.ఎన్.రెడ్డి ఇచ్చిన సలహా ప్రకారం.. తొలుత ఆ ఆఫర్లను చంద్రమోహన్ తిరస్కరించారు. అయితే, అదే బీఎన్ రెడ్డి వల్ల ఆయన తన ఆలోచన తీరును మార్చుకున్నారు. అదేంటంటే.. బీన్ రెడ్డి *బంగారు పంజరం* అనే సినిమా తీయనున్నట్టు ప్రకటించి.. అందులో తారాగణం వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆ జాబితాలో తన పేరు లేకపోవడంతో చంద్రమోహన్ ఆయన వద్దకు వెళ్లి అడిగారు. దీనికి ఆయన, 'ఈ సినిమాలో నీకు తగిన పాత్ర లేదు. ఇద్దామనుకున్నా చేయడానికి నీ వయసు సరిపోదు,' అన్నారు. ఆ సంఘటన తన కళ్లు తెరిపించిందని చెప్పేవారు చంద్రమోహన్. ఆ తర్వాత తనకు సమకాలికులైన కృష్ణ, శోభన్‌బాబు చిత్రాల్లో వారికి తమ్ముడిగానో, స్నేహితుడిగానో నటించడం మొదలుపెట్టారు. ఇదే ఆయన్ని ఎంతో బిజీ చేసింది. పాత్ర చిన్నదైనా పెద్దదైనా చేస్తూ పరుగు పందెంలో ఉండడం ముఖ్యం అనుకున్నారు. కమెడియన్, సహాయనటుడు, విలన్... ఇలా ఏ పాత్ర ఇచ్చినా చేయగల ఆల్‌రౌండర్ అనే పేరు రావడంతో దర్శక, నిర్మాతలు చంద్రమోహన్‌కు ఆఫర్లు ఇచ్చేవారు.

### హీరోగా నిలబెట్టిన విశ్వనాథ్

చంద్రమోహన్‌కు హీరో వేషం ఇచ్చి నిలబెడదామని కొంతమంది దర్శక, నిర్మాతలు ప్రయత్నించారు. కానీ అంతకుముందు ఆయన పోషించిన పాత్రల ప్రభావం వ్యాపారపరంగా అడ్డుపడే ప్రమాదం ఉండడంతో ఎవరూ ధైర్యంగా ముందడుగు వేయలేకపోయారు. చివరకు చంద్రమోహన్‌కు సోదరుడు (పెద్దనాన్న కొడుకు), కళాతపస్వి కె. విశ్వనాథ్ ధైర్యం చేసి *ఓ సీత కథ* చిత్రంలో హీరోగా అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత కూడా కొన్ని చిత్రాల్లో హీరోగా నటించినా అవేవీ చంద్రమోహన్ కెరీర్‌కు పెద్దగా సహాయపడలేదు. అయినా మళ్లీ *సిరిసిరిమువ్వ* చిత్రంతో మరో మంచి అవకాశం ఇచ్చారు విశ్వనాథ్. ఇక అప్పటి నుంచి సింగిల్ కాల్షీటు పాత్రలు అంగీకరించకుండా జాగ్రత్తపడ్డారు చంద్రమోహన్. అప్పుడే పదహారేళ్ల

వయసు చిత్రంలో అవకాశం రావడంతో హీరోగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలిగారు. అయితే ఇదంతా జరగడానికి చాలా ఏళ్లు పట్టింది. *రంగులరాట్నం* చిత్రం తర్వాత.. పరిశ్రమలో హీరోగా తను పోగొట్టు కున్న స్థానాన్ని 14 ఏళ్ల తర్వాత కానీ పొందలేకపోయా రాయన.

### నాలుగు తరాల నటులతో

ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్... ఇలా నాలుగు తరాల హీరోలతో పని చేసిన ఘనత చంద్రమోహన్‌ది. 'నువ్వు స్టార్‌వి కాదురా.. ఆర్టిస్ట్‌వి. కొంచెం ఎత్తు ఉండి ఉంటే సినీ రంగాన్ని ఏలేవాడివి,' అంటుండే వారు ఎస్వీ రంగారావు. అక్కినేని కూడా, 'నీకూ నాకూ ఒకటే డిఫెక్ట్ అయ్యా.. పొట్టి,' అని నవ్వుతూ కామెంట్ చేసేవారట. *అల్లుళొస్తున్నారు జాగ్రత్త* చిత్రంలో చిరంజీవితో కలిసి హీరోగా చేసిన చంద్రమోహన్.. అదే చిరంజీవికి *ఇద్దరు మిత్రులు* సినిమాలో తండ్రిగా నటించారు. ఆయనెప్పుడూ వచ్చిన పాత్రను ఎంత అద్భుతంగా పండించాలని ఆలోచించేవారే తప్ప పెద్దదా, చిన్నదా అని చూసేవారు కాదు.

### హీరోయిన్ల లక్కీస్టార్...

యాదృచ్ఛికమే అయినా చంద్రమోహన్ పక్కన నటించిన దాదాపు 60 మంది కథానాయికల్లో అత్యధికులు ఆ తర్వాత టాప్‌స్టార్లు అయ్యి ఆయనతో తొలిసారి నటిస్తే స్టార్‌డమ్ కచ్చితమనే సెంటిమెంట్ వ్యాపించేలా చేశారు. తెలుగువారినే కాకుండా యావత్ భారతదేశాన్ని అలరించిన శ్రీదేవి, జయప్రదలతోపాటు జయసుధ, విజయనిర్మల, రాధిక, విజయశాంతి, మంజుల, చంద్రకళ... ఇలా ఎందరికో తొలి హీరో ఆయనే. హిందీ నటి రేఖ *రంగులరాట్నం* చిత్రంలో చంద్రమోహన్‌తో కలిసి చిన్న పాత్రలో నటించింది.

### ఇనుముకు చెదలు పడతాయా...

సినీ పరిశ్రమలో చంద్రమోహన్ దాదాపు యాభై ఏళ్లపాటు నిర్విరామంగా పనిచేశారు. తన ఆరోగ్యాన్ని కూడా నిర్లక్ష్యం చేసి రాత్రింబవళ్లూ పనిచేసిన రోజులున్నాయి. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని ఎవరైనా హెచ్చరించినా... 'ఇనుముకు చెదలు పడతాయా?' అనేవారు. తన ఆరోగ్యం అంత గట్టిదని ఆయన నమ్మకం. కానీ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన *రాఖీ* చిత్రంలో ఒక భావోద్వేగ సన్నివేశాన్ని చేసిన వెంటనే చంద్రమోహన్‌కు గుండెపోటు వచ్చి





ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. ఆయన అనారోగ్యం కారణంగా అల్లు అర్జున్ దువ్వాడ జగన్నాథం షూటింగ్‌కు బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. దీంతో... తన వల్ల నిర్మాతలు ఇబ్బంది పడకూడదని చంద్రమోహన్ రిటైర్‌మెంట్ తీసుకున్నారు.

దర్శకుడి ఊహలో రూపుదిద్దుకున్న పాత్రకు తెర మీద ప్రాణ ప్రతిష్ట చేయడంలో చంద్రమోహన్‌కు తిరుగులేదు. ఎందుకంటే తెర మీద ఆయన కనిపించరు కానీ పాత్ర మాత్రమే కనబడేలా చేయ గలగడం ఆయన గొప్పతనం.

80వ దశకంలో చిరంజీవి లాంటి హీరోలు వచ్చిన తర్వాత కూడా చంద్రమోహన్ హీరోగా చేస్తూనే వచ్చారు. విశ్వనాథ్, బాపులాంటి కొత్త తరహా ఆలోచన లతో ముందుకు వచ్చిన దర్శకులకు చంద్రమోహన్ ఒక వరంగా కనిపించేవారు.

తమిళ సినిమా రంగంలో కమల్‌హాసన్ ఏ తరహా మార్పుకు నాంది పలికారో... తెలుగు పరిశ్రమలో చంద్రమోహన్ కూడా అలాంటి పాత్రనే నిర్వహించారని అలనాటి నటీనటులు అంటారు. నట దర్శకురాలు విజయనిర్మల దర్శకత్వం వహించిన దాదాపు అన్ని చిత్రాల్లోనూ చంద్రమోహన్ కీలక పాత్రలు చేశారు.

చంద్రమోహన్ పలు తమిళ చిత్రాల్లోనూ నటించారు. నట దిగ్గజాలు దివంగత ఎంజీ రామచంద్రన్, నడిగర్ తిలగం శివాజీ గణేశన్ చిత్రాల్లో నటించి, తమిళ సినీ ప్రేక్షకులకు కూడా చేరువ య్యారు. 1975లో ఎంజీఆర్ నటించి విడుదలైన నాళై నమదే అనే చిత్రంలో ఎంజీఆర్ తమ్ముడి పాత్రలో చంద్రమోహన్ కనిపించారు. అదేవిధంగా శివాజీ గణేశన్ నటించిన అండమాన్ కాదలి చిత్రంలో ఆయన కుమారుడి పాత్రలో నటించారు.

నాటకీయతని, అతిని ప్రదర్శించే రోజుల్లో రంగప్రవేశం చేసినా సరే... తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా నిజంగా ప్రవర్తిస్తున్నట్టు నటించటం ఈ సహజనటుని ప్రత్యేకత!

శుభోదయంలో పనిదొంగగా, బద్ధకానికి నిలువెత్తు నిర్వచనంలా కనిపించే పాత్రలో చంద్ర మోహన్ నటన అద్భుతం. బంగారు పిచ్చికలో చంద్ర మోహన్ చేసిన బంగార్రాజు పాత్ర అప్పటి కుర్ర హీరో లకే కాదు... ఇప్పటివారికీ ఛాలెంజే. ప్రాణంఖరీదు సినిమాలో మూగ, చెవిటి పనివాడిగా చంద్రమోహన్ నటన ఉన్నత శిఖరాలకు ఎక్కింది.

బాపు తీసిన రాధాకల్యాణంలో పాల్ఘాట్ మాధవన్‌గా తమిళయాసని పట్టుకోవడం అంత సులభ మేమీ కాదు. కానీ ప్రతిభాశాలి చంద్రమోహన్‌కి అదే మంత పెద్దపని కాలేదు.

*7/జి బృందావన్ కాలనీలో* కొడుకుని పడేసి తన్నే తండ్రి పాత్రలో ఇంట్లో తండ్రులే కనబడ్డారు.

పదహారేళ్ల వయస్సులో అమాయకత్వంగా, కలికాలం, ఆమె చిత్రాలలో కరుణగా, ఆడదే ఆధారం, పెద్దరికం సినిమాలలో కామెడీగా, పాపే నా ప్రాణంలో విలన్‌గా.. వేటికవే... ఏ పాత్ర అయినా పరకాయ ప్రవేశమే.

దాదాపు 900 పైగా సినిమాల్లో హీరో, సైడ్ హీరో, కమెడియన్, విలన్, సహాయనటుడు.. చెయ్యని పాత్రా, వెయ్యని వేషం లేదు. అలాంటి మరో నటుణ్ణి చూస్తామోలేదో కూడా తెలీదు.

బ్లాక్ & వైట్ కె. విశ్వనాథ్ మొదలుకుని బాపు, జంధ్యాల, నేటి ట్రెండ్ సెట్టర్లు త్రివిక్రమ్, శ్రీనువైట్ల దాకా అందరి దగ్గరా పాత్రల్ని సునాయాసంగా పోషించి రక్తి కట్టించిన నటులెవరన్నా ఉన్నారా...?

ఒకే ఒక్క చంద్రమోహనున్నాడు...!! ❀



జలపతి & శ్రీ అట్లూరి

# 2024 సంక్రాంతి సినిమా పందెం కోళ్లు!

సంక్రాంతి తెలుగువాళ్లకు పెద్ద పండుగ. ముఖ్యంగా కోస్తాంధ్రలో సంక్రాంతికి ఉండే సందడి గురించి ఎంత చెప్పినా తక్కువే. సంక్రాంతి పండగ సమయంలో కొత్త సినిమాలు చూడడం కూడా ఒక సంప్రదాయంగా మారింది చాన్నాళ్లుగా. అందుకే, ప్రతి సంక్రాంతికి పెద్ద సినిమాల హంగామా ఎక్కువగా ఉంటుంది. నాలుగు, అయిదు నెలల ముందే సంక్రాంతికి వచ్చే సినిమాలు ప్రకటనలు ఇచ్చేస్తాయి.

అయితే, ఈసారి మాత్రం కొంత గందరగోళం ఉంది. 2024 సంక్రాంతికి ఎన్ని సినిమాలు విడుదల అవుతాయో చెప్పలేని పరిస్థితి. దీని అంతటికి కారణం... ప్రభాస్ హీరోగా నటించిన సలార్.


ఏ ముహూర్తాన సలార్ సెప్టెంబర్ నుంచి వాయిదా పడిందోకానీ, అప్పట్నుంచి మిగతా సినిమాలన్నీ కిందా మీదా అవుతున్నాయి. ఆ ప్రభావం సంక్రాంతి సినిమాల వరకు పడింది. ఇప్పటికే సంక్రాంతికి చాలా పోటీ ఉంది. సలార్ వాయిదాతో ఇది మరింతగా ముదిరింది.

ఇంతకీ సంక్రాంతికి వచ్చే సినిమాలెన్ని? వాటి ప్రత్యేకతలేంటో చూద్దాం....

### *సంక్రాంతికి గుంటూరు కారం ఘాటు*

పండగ పోటీలో అన్నింటికంటే ముందున్న సినిమా గుంటూరు కారం. ఈ సినిమాపై అందరిలో భారీ అంచనాలున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. కానీ విడుదలపైనే మొన్నటివరకు ఎన్నో అనుమానాలు. ఎందుకంటే, ఈ సినిమా ఇప్పటిది కాదు, దాదాపు మూడేళ్లుగా నలుగుతోంది. ఎప్పుడు పడితే అప్పుడు వాయిదాలు పడుతోంది. షూటింగ్ కచ్చితంగా ఎప్పుడు పూర్తి అవుతుందో, ఈ టీమ్ నుంచి ఎప్పుడు ఎవరు తప్పుకుంటారో తెలియని పరిస్థితి. అలా కిందామీదా పడుతూ లేస్తున్న ఈ సినిమా కచ్చితంగా సంక్రాంతికి వస్తుందంటున్నారు నిర్మాత నాగవంశీ. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ పుంజుకుంది. అంటే, సంక్రాంతికి వచ్చే అతిపెద్ద సినిమాల్లో






మొదటిది ఇదే.

దాదాపు పుష్కరం తర్వాత మహేష్-త్రివిక్రమ్ కలిసి చేస్తున్న సినిమా *గుంటూరు కారం*. వీరి కలయికలో ఇంతకుముందు వచ్చిన అతడు, ఖలేజా చిత్రాల గురించి ఈనాటికీ జనం మాట్లాడుకుంటారు. అతడు సినిమా థియేటర్లో కన్నా టీవీల్లో ఎక్కువగా ఆడింది. ఖలేజా విజయం సాధించలేదు కానీ బాగుంటుంది అనేవాళ్లు ఎక్కువమందే. అందుకే, *గుంటూరు కారం* పై చాలా ఘాటైన అంచనాలు ఉన్నాయి. జనవరి 12న విడుదల కానుంది.

## సైంధవ్ సై!

క్రిస్మస్ కానుకగా రావాల్సిన సైంధవ్ సినిమా కూడా సలార్ వల్ల ఇబ్బంది పడింది. సలార్ క్రిస్మస్ బరిలోకి దిగడంతో సైంధవ్ విడుదల తేది మారింది. ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది.

ఈ సినిమా వెంకటేష్ కెరీర్‌లో ప్రత్యేకం. ఇది హీరోగా వెంకటేష్‌కి 75వ చిత్రం. అంతేకాదు. వెంకటేష్ సైతం పాన్ ఇండియా ట్రెండ్ ఈ సినిమాతో మొదలు పెడుతున్నారు. ఈ చిత్రం ఒకేసారి 5 భాషల్లో విడుదల కానుంది. వెంకటేష్‌కు సంక్రాంతి కలిసి వచ్చిన కాలం. ఆయన కెరీర్‌లో *కలిసుందాం రా* వంటి సంచలన విజయాలు సంక్రాంతి సమయంలో దక్కినవే.

హిట్ వంటి సినిమాలు తీసిన శైలేష్ కొలను ఈ చిత్రానికి దర్శకుడు. ఇది కూడా ఒక పాప చుట్టూ జరిగే కథ. ఇటీవల సీనియర్ హీరోలు ఇలా పాప, బాబు సెంటిమెంట్‌తో భారీ విజయాలు అందుకున్నారు. జైలర్‌లో రజినీకాంత్, విక్రమ్‌లో కమల్‌హాసన్ చేసింది అదే. ఆ విధంగా చూసిన వెంకటేష్ సైంధవ్ చిత్రం మంచి అంచనాలున్న సినిమాగానే పరిగణించాలి.

## పండగకి సామిరంగా!

సంక్రాంతిని నాగార్జునను విడదీసి చూడలేం. సంక్రాంతి పండగ సమయంలోనే ఆయన ఎక్కువ విజయాలు చవిచూశారు. 2015 తర్వాత నాగార్జునకి వచ్చిన హిట్స్ రెండే. ఆ రెండూ (*సోగ్గాడే చిన్ని నాయన, బంగార్రాజు*)కూడా ఈ పండుగ సమయంలో విడుదలైనవే. ఈ కారణంగానే నాగార్జున ఎట్టి పరిస్థితుల్లో సంక్రాంతికి తన కొత్త చిత్రాన్ని విడుదల చెయ్యాలని పట్టుదలగా ఉన్నారు. మిగతా సినిమాలు వచ్చినా రాకున్నా, ఎన్ని పోటీపడ్డా... తన చిత్రం మాత్రం పొంగల్ పోటీలో ఉంటుంది అని స్పష్టం చేశారు నాగార్జున.

ఈ సినిమా ప్రత్యేకత ఏంటంటే... *నా సామి రంగా* సినిమాను సెట్స్ పైకి తీసుకురాకముందే రిలీజ్ డేట్ ప్రకటించారు. ఇప్పుడు ఆ తేదీకి తగ్గట్టు శరవేగంగా షూటింగ్ నిర్వహిస్తున్నారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నాగార్జునతో పాటు అల్లరి నరేష్, రాజ్ తరుణ్ కూడా నటిస్తుండడం మరో విశేషం.

## పొంగల్‌కి ఈగిల్

పొంగల్ పోటీలోకి మాస్ మహారాజా రాజా కూడా చేరిపోయారు. ఈ దసరాకి *టైగర్ నాగేశ్వరరావు* చిత్రాన్ని తీసుకొచ్చిన రవితేజ సంక్రాంతి పండుగకి *ఈగిల్* చిత్రాన్ని దించుతున్నారు. సినిమాటోగ్రాఫర్ నుంచి దర్శకుడిగా మారిన కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇది కూడా



జనవరి 13న విడుదల కానుంది. ఈ మేరకు నిర్మాతలు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈగిల్‌లో రవితేజ కొంచెం కొత్తగా కనిపించనున్నారు. అనుపమ పరమేశ్వరన్, కావ్య థాపర్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో నవదీప్, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు.

### బరిలో హనుమాన్ కూడా!

ఇక సంక్రాంతి బరిలో నిలిచిన మరో చిత్రం... హను-మాన్. ఇది కూడా చాలాకాలంగా షూటింగ్‌లో ఉంది. ఇదిగో రిలీజ్, అదిగో రిలీజ్ అంటూ సంక్రాంతి వరకు లాక్కొచ్చారు. ఈ వేసవి సెలవుల్లో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని సంక్రాంతి వరకు వాయిదా వేశారు. ఇక డేట్ మారదు అంటున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. బరిలో ఉన్న మిగతా చిత్రాలతో పోల్చితే ఈ సినిమాకి 'స్టార్' బలం లేదు. కానీ దీనిపై అంచనాలు మాత్రం భారీగా ఉన్నాయి. ఎందుకంటే ఈ సినిమా టీజర్ పెద్ద హిట్టయింది. తెలుగులోనే కాదు హిందీలో కూడా బాగా పాపులర్ అయింది.

అయోధ్యలో కడుతున్న రామమందిరం జనవరిలో ప్రారంభమవుతుంది. కాబట్టి సంక్రాంతికి ఈ సినిమాని విడుదల చేస్తే ఉత్తర భారతదేశంలో మంచి వసూళ్లు వస్తాయి. ఆ ఉద్దేశంతోనే పొంగల్ పోటీలో నిలిచింది హను-మాన్.

యువ హీరో తేజ సజ్జా నటిస్తున్న ఈ చిత్రం కథ ఇండియన్ సూపర్‌మేన్‌లా సాగుతుంది. హనుమంతుని శక్తులను పొంది అంజనాద్రి కోసం హీరో ఎలా పోరాడాడనేది చిత్ర కథాంశం. హను-మాన్ చిత్రం తెలుగుతోపాటు హిందీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, ఇంగ్లీష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్ భాషలలో విడుదల కానుంది.

### పండక్కి ఫ్యామిలీ

ఈ చిత్రాలతోపాటు విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు పరశురామ్ తీస్తున్న ఫ్యామిలీ స్టార్ సినిమా కూడా సంక్రాంతికే అంటూ ప్రకటించారు. వీళ్లిద్దరి కలయికలో గతంలో గీతగోవిందం సినిమా వచ్చింది. అది పెద్ద హిట్. ఇప్పుడు మళ్లీ హిట్ కాంబినేషన్.

సీతారామంతో తెలుగులో పేరు తెచ్చుకున్న బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఇందులో హీరోయిన్. ఈ సినిమాని దిల్ రాజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ నడుస్తోంది. ఇది కూడా సంక్రాంతి బరిలో నిలిస్తే మొత్తంగా ఆర డజను తెలుగు చిత్రాలు పొంగల్ పోటీలో ఉంటాయి.

### బరిలో మరికొన్ని అనువాద చిత్రాలు

ఇక్కడితో సంక్రాంతి స్ట్రయిట్ సినిమాల లిస్ట్ ముగిసింది. అయితే పోటీ ఇంకా ఉంది. ఆశ్చర్యంగా డబ్బింగ్ సినిమాలు కూడా తగ్గేదేలే అంటున్నాయి. జైలర్‌తో భారీ విజయం అందుకున్న రజనీకాంత్ లాల్ సలాం సినిమాతో పొంగల్‌కు వస్తున్నారు. అయితే ఇందులో ఆయనది ఫుల్ లెంగ్త్ రోల్ కాదు. ఓ కీలక పాత్ర మాత్రమే. రజనీ కూతురు ఐశ్వర్య దీనికి దర్శకురాలు.

ఈ సినిమాతోపాటు అయలాన్ కూడా సంక్రాంతికి వస్తుంది. శివ కార్తికేయన్, రకుల్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ జానర్‌తో తెరకెక్కింది. రీసెంట్‌గా టీజర్ కూడా రిలీజైంది. అనుకోకుండా, మరో గ్రహం నుంచి ఓ గ్రహాంతరవాసి భూమ్మీదకు వస్తాడు. అతడు నేరుగా శివకార్తికేయన్ ఇంట్లో తిష్ట వేస్తాడు. టీజర్‌లో ఈ విషయాల్ని చూపించారు. భూమ్మీదకు వచ్చిన గ్రహాంతరవాసి ఏం చేశాడు అనే కోణంలో ఈ సినిమా సాగుతోంది.

ఇలా ఇన్ని చిత్రాలు పోటీ పడితే థియేటర్ల సమస్య వస్తుంది. కొన్ని చిత్రాలకు ఆదాయం భారీగా పడిపోయే ప్రమాదం ఉంది. మరి చివరికి ఎన్ని పోటీలో ఉంటాయి. ఎన్ని హిట్ అవుతాయో చూడాలి.

# WE ARE LOOKING for FRANCHISEE PARTNERS

CURIE LEARNING
*learning with the leader ...*



Curie Learning is a leading provider of customized after school learning programs for students Pre-K through high school.

**Our Programs:**

- K to Grade 7 Advanced Math & English program
- Specialized coaching for Magnet / Gifted and Talented School Entrance
- SAT / PSAT / ACT Specialized Coaching
- Creative English Writing
- Competitive Math Coaching
- S T E M Programs and other Academic Camps

## OTHER LOCATIONS

| | |
|---|---|
| Gainesville - VA | gainesville.va@curielearning.com |
| Ellicott City - MD | ellicottcity.md@curielearning.com |
| German Town - MD | germantown.md@curielearning.com |
| Edison - NJ | edison.nj@curielearning.com |
| Exton - PA | exton.pa@curielearning.com |
| Cumming - GA | curie.atlanta@gmail.com |
| Frisco - TX | frisco.tx@curielearning.com |
| Troy - MI | troy.mi@curielearning.com |
| Plymouth - MN | plymouth.mn@curielearning.com |
| Richmond - VA | richmond.va@curielearning.com |
| Apex - NC | apexcurie@gmail.com |
| Sunnyvale - CA | sunnyvale.ca@curielearning.com |

To know more about franchisee opportunity write to :
**rao@curielearing.com**
or call on
**703 582 0436 or 703 762 6120**

**Corporate Centers**

HERNDON.VA : herndon.va@curielearning.com
SOUTHRIDING.VA : southriding.va@curielearning.com
ASHBURN.VA : ashburn.va@curielearning.com

www.curielearning.com

**One stop solution for your child's academic needs...**